# చీఫ్ మినిస్టర్



**Part - 1**

రోడ్ నిర్మానుష్యంగా ఉంది. ఎక్కడి ట్రాఫిక్ అక్కడే ఆపేశారు. కాసేపట్లో సీఎం కాన్వాయ్ ఆ దారిలో రాబోతోంది.

ఆఫీస్ లకి వెళ్లాల్సిన వాళ్ళు, అర్జెంట్ పనులున్న వాళ్ళు తలలు పట్టుకున్నారు. టైమ్ కి చేరలేమని వాళ్ళకి అర్థమయిపోతోంది.

"వీళ్లేదో వొరగబెడతారని గెలిపిస్తాం. ప్రతి పనికీ వీళ్ళు అడ్డమే". నిస్పృహ గా అన్నాడు బైక్ మీద ఇంటర్వ్యూ కి బయల్దేరిన ఒకతను. 'ఇవ్వాళ ఇంటర్వ్యూ పోయినట్లే ' ఉసూరుమన్నది అతని మనసు.

"ప్రాణాలకు తెగించి సోషల్ మీడియా లో ప్రచారం చేసి గెలిపించారు గా. ఏం ఉద్ధరించాడు ఈ సీఎం. ఎవరైనా ఒకటేరా. రాజకీయ నాయకులకి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది" పక్క బైక్ మీద వెనక కూర్చున్నాయన ముందున్న కొడుకు కి క్లాస్ పీకుతున్నాడు.

తిట్టుకుంటూ నే అంతా సీఎం కనపడతాడేమో అని ఎగిరి ఎగిరి చూస్తున్నారు.

కాసేపటికి పోలీస్ జీప్ ఆ దారిలో సైరన్ మోగిస్తూ వెళ్ళింది. కొన్ని సెకండ్ల తర్వాత నాలుగు బైక్ ల మీద కొంత మంది సెక్యూరిటీ సిబ్బంది వెళ్లారు. కాసేపటికి మరో పోలీస్ జీప్. దాని వెనక ఒకే మోడల్, ఒకే కలర్ ఉన్న ఎస్యూవీ లు అయిదు స్పీడ్ గా వెళ్లిపోయాయి. చివర్లో మరో పోలీస్ జీప్.

మూడవ కార్లో ఉన్నాడు సుధీర్. జనం ట్రాఫిక్ ఆపినందుకు తనను తిట్టుకుంటూ ఉండి ఉంటారు అనిపించింది అతనికి. ఒకటే నంబర్ కార్స్ అన్నీ. నక్సలైట్లు తనని టార్గెట్ చేసినా దొరక్కుండా ఉండటానికి అంట. తన తాతల కాలం నుంచీ ఇదే టెక్నిక్. అవతల వాళ్ళేమో డ్రోన్స్ వాడేంత అడ్వాన్స్ అయ్యారు.

తను సీఎం కాకముందు నుంచే ఇంతకంటే ఎక్కువ కార్స్ తో కాన్వాయ్ మైన్టెయిన్ చేశాడు. మొత్తం తొమ్మిది కార్స్ ఉండేవి అప్పుడు. ఒకే రకంవి. పనీ పాటా లేని వాళ్లంతా వాటిలో ఎప్పుడూ తనతోనే తిరిగేవారు. తనేం చేసినా వాళ్ళు వెనకేసుకు వచ్చేవాళ్ళు. కూర్చుని లేచినా అన్న సింహం, పులి అని పొగిడే వాళ్ళు. ఆ రోజులే పేరు...ఆప్యాయం గా గుర్తు చేసుకున్నాడు.

సీఎం అయ్యాక సెక్యూరిటీ ఆంక్షలు అనీ, అదనీ, ఇదనీ తన కాన్వాయ్ లో కార్స్ ని కుదించి, తన తో వచ్చే వాళ్ళని కూడా మార్చేశారు.

అతి సురక్షితం గా లోపల కూర్చున్న సుధీర్ కి ఊపిరి ఆడట్లేదు. కార్ దూకి ఎటన్నా పారిపోవలనిపిస్తోంది.

రోడ్లన్నీ ఖాళీగా ఉన్నాయి.

వెధవ ప్రోటోకాల్. రాక్షసులు వస్తుంటే ఖాళీ అయినట్లు గా రోడ్లు బోసిపోయున్నాయి.

మామూలు మనుషులనే వాళ్లే కనపడటం మానేశారు cm అయ్యాక. కనపడ్డ కొంతమందీ చేతిలో ఏదో ఒక వినతి పత్రం పట్టుకుని ఉంటారు. ఎన్నని చేయగలడు తనైనా. అందరికీ ఎప్పుడూ కష్టాలు, కన్నీళ్ళే. వినీ వినీ విసుగొస్తోంది.

మొదట్లో గొప్పగా అనిపించేది నన్నే కదా అడుగుతున్నారు అని. ఇప్పుడు లాగి కొట్టాలనిపిస్తోంది జనాలకి ఎప్పుడూ బీద ఏడుపులే.

ఈ మధ్య కాలం కలిసి రావటం లేదు. తను ఏ నిర్ణయం తీసుకున్నా బెడిసికొడుతోంది. ప్రతి విషయానికి రోడ్లెక్కి అల్లర్లు, లేదంటే సోషల్ మీడియాలో trolling. పొరపాటున ఏదైనా మంచి పని చేద్దాం అన్నా చివరకొచ్చేసరికి అది రచ్చగా మారుతోంది.

నిన్ననే ఒక హత్య జరిగింది. నగరం నడిబొడ్డున. తను ఆ టైమ్ కి ఓ విదేశీ కంపెనీ వాళ్ళతో మీటింగ్ లో ఉన్నాడు. తన రాష్ట్రం లో పెట్టుబడులు పెట్టటానికి వచ్చారు వాళ్ళు. ప్రతిపక్షాల వాళ్లు ఆ హత్యనూ తమ అకౌంట్ లోకి వేస్తున్నారు. తనే దగ్గరుండి చేయించినట్లు.

ప్రతిపక్షం లో కాని, ప్రజలలో ఎవరికైనా గానీ stomach upset అయినా కల్తీ ఆహారం, పట్టించుకోని సీఎం అని headlines. కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్ళ కాదేదీ కవిత కి అనర్హం అన్నట్లు గా ప్రతి అవకతవక తన మీదే.

తన మీద తనకి అంత గొప్ప అభిప్రాయం ఏమి లేదు ఇన్నాళ్లూ. కానీ ఈ అరాచకత్వం చూస్తుంటే తన మీద తనకే జాలేస్తోంది.

"సర్, ఒకసారి స్పీచ్ చూసుకుంటే"...నసుగుతున్నాడు విష్ణు.

ఆలోచనల్లో నుంచి బయటకొచ్చాడు సుధీర్.

తను రాజకీయాల్లోకి వచ్చిన దగ్గర నుంచీ తననే అంటి పెట్టుకుని ఉన్నాడు విష్ణు. నమ్మకస్తుడు. ప్రెస్ నీ, పార్టీ వాళ్ళని చాలా సార్లు కొత్త కొత్త వ్యూహాలతో తనకు అనుగుణంగా మార్చాడు. కానీ ఈ మధ్య అతణ్ణి చూస్తుంటే కూడా చిరాగ్గా ఉంటోంది. పిల్లల్ని చదువుకోమని పెద్దవాళ్ళు నస పెట్టినట్లు చాదస్తం గా మాట్లాడుతున్నాడు అనిపిస్తోంది.

కార్ స్టేడియం ని సమీపిస్తోంది. గుండెల్లో దడ మొదలైంది. ఏం అడిగి చస్తారో ప్రెస్ వాళ్ళు. టెన్షన్ లో మాట తడబడితే తన మీద వార్తలు, trolls తప్పవు. వెధవ సీఎంగిరీ.

కార్ స్లో అవగానే బ్లాక్ కాట్ కమాండో లు కార్ పక్కనే పరిగెత్తటం మొదలెట్టారు. వాళ్ళని చూస్తే ఈ మధ్య విపరీతమైన జెలసీ కలుగుతోంది. ప్రతిపక్షాల మాట దేవుడెరుగు. ముందు వీళ్ల మీద మండిపోతోంది. వాళ్ళలో ఒకడిని కాలు అడ్డం పెట్టి కింద పడేయలనిపిస్తుంది. ఇదేం ఎనర్జీ వీళ్ల లో. ఒక్కసారైనా కాలు మడత పడి పడొచ్చుగా. బలంగా, ఆరోగ్యంగా, పొడుగ్గా, నల్ల డ్రెస్ లో స్టైలిష్ గా వాళ్ళు.

మామూలుగా తను పొడుగు కిందే లెక్క అయినా వాళ్ళ మధ్యన పొట్టిగా, కళ్ళజోడుతో, తింటే ఆయాసం, తినకపోతే నీరసం లాగా, జోకర్ లాగా కనబడతాడు. ఉక్రోషం గా ఉంది అతనికి.

అర్జంట్ గా బాత్రూమ్ కి వెళ్లాల్సి వచ్చేలా ఉంది. సైగ చేశాడు విష్ణు కి.

"బయల్దేరే ముందు ఇంట్లో వెళ్లే వచ్చారు కదా" ఆశ్చర్యం గా అన్నాడు విష్ణు.

విష్ణు ని కోపంగా చూసాడు. ఎవరి మీదా కోపం చూపించే అవకాశం లేదు. వెధవ కెరీర్. ఎవడెప్పుడు అడ్డం తిరుగుతాడో... ఏ రహస్యాలు బయటకి వస్తాయో అనే భయం. సెక్రెటరీ లకి, డ్రైవర్ లకీ మరీ భయపడాల్సి వస్తోంది.

ఈ మూడేళ్లలో స్ట్రెస్ తట్టుకోలేక  షుగర్, బీపీ వచ్చాయి. అన్నీ తెలిసీ ఇప్పుడే వెళ్లారు కదా బాత్రూమ్ కి, మళ్లీనా అని ప్రశ్న.

ఇల్లు గుర్తొచ్చింది అతనికి.

***

బయటికి వెళ్ళటానికి రెడీ అవుతున్నాడు. విష్ణు ఆ రోజు తన కార్యక్రమాల గురించి చెప్తున్నాడు వివరిస్తున్నాడు తనకు.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని శ్రద్ధ గా కూరగాయలు కట్ చేస్తోంది బృంద.

సన్నటి, పొడుగాటి మనిషి. బంగారు రంగు లో మెరిసిపోతోంది. వయసు వల్లనేమో కొద్దిగా అలిసిపోయినట్లు కనపడుతోంది. తీర్చి దిద్దినట్లున్న పోలికలు. దేవుళ్ళ ఫోటోల్లో నుంచి దిగి తనింట్లోకి వచ్చినట్లు ఉంటుంది.

తను సీఎం అయినా ఏ మాత్రం లెక్క  లేనట్లే ప్రవర్తిస్తుంది. ఒంటి చేత్తో ప్రత్యర్థులను మట్టి కరిపించి ప్రపంచ బాక్సింగ్ లో తిరుగు లేని ముద్ర వేసిన ప్రసిద్ధ బాక్సింగ్ ఛాంపియన్ ముహమ్మద్ అలీ,  తన మొదటి భార్య తో చేసిన యుద్ధం తన జీవితం లో అతి క్లిష్టమైనది అన్నాడొక సందర్భంలో. ఇక సోక్రటీస్ ని అయితే భార్య తిట్టని తిట్టు లేదంటారు. శిష్యులతో అతను మాట్లాడుతుంటే వచ్చి మీద నీళ్ళు పోసేది అని చెప్పుకుంటారు. మంచి భార్య దొరికితే ఆనందంగా ఉండొచ్చు, చెడ్డ భార్య దొరికితే ఫిలాసఫర్ అవొచ్చనే నానుడి అక్కడ నుంచే మొదలయింది. ఇక ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ నీ రెండవ భార్య కొట్టేదంటారు.

భార్య లకి భర్త సీఎం అయినా, పీఎం అయినా చులకనే. అందుకే ఈ మధ్య పీఎం కాండిడేట్ లు పెళ్లిళ్లు చేసుకోటం మానేశారు.

బృందని చూస్తే తనలో ఏదో భయం, చెప్పలేనంత ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్.

తమ మధ్య మాటలు ఆగిపోయి కొన్నేళ్లవుతుంది.

మదాలస విషయం తెలిసిన రోజు తర్వాత మారతాడు అనుకుందేమో, పెద్ద కనురెప్పలు పైకిఎత్తి నిరసన గా చూసింది. కానీ మాట్లాడటం మానేయలేదు.

వేరే వాళ్ళయితే ఆ చూపు కి ఆత్మహత్య చేసుకునేవాళ్లు. రాజకీయాల్లో ఢక్కామొక్కీలు తిని ఉన్న అనుభవంతో తను తట్టుకోగలిగాడు.

తమ ఇద్దరికీ మాటలు ఆగిపోయిన రోజు నాటి సంఘటన ఇప్పటికీ గుర్తుంది తనకి.

***

అప్పుడప్పుడే తను రాజకీయాల్లో పైకి వస్తున్న రోజులు.

నిద్ర లేచి బయటికి వస్తున్నాడు తను. హాల్లో బృంద తో పాటు తమ ఊరివాళ్లు కొంత మంది కనపడ్డారు. అప్పుడే టీ ఇచ్చినట్లుంది. అంతా టీ తాగుతున్నారు.

తనని చూడగానే వాళ్ళలో ఒకడు పరుగెత్తుకొచ్చి తన కాళ్ళు పట్టుకున్నంత పని చేశాడు. అతడి భూమి ని తన మనుషులు కబ్జా చేశారట. ఆ భూమి తప్ప తనకి మరో ఆధారం లేదని ఏడుపు మొదలెట్టాడు. ఎలాగయినా తన భూమిని తనకు ఇప్పించమని బ్రతిమాలాడు.

తన వాళ్ళు అలా చేయరనీ, ఆ భూమి నిజంగా అతనిదేనా అనీ ప్రశ్నించాడు తను అతణ్ణి. అన్ని ప్రూఫ్ లూ పట్టుకొచ్చాడు వెధవ.

"నేను అన్ని డాక్యుమెంట్లు చెక్  చేశాను, ఆ భూమి అతనిదే" అంది బృంద.

'చదువుకున్న వాళ్ళను ఇందుకే పెళ్లిళ్లు చేసుకోకూడదు' తనను తానే నిందించుకున్నాడు సుధీర్ ఆ క్షణాన.

"కనుక్కుంటాను" అని చెప్పి వాళ్ళను పంపేశాడు  ఆ రోజుకి.

అతని స్థలాన్ని తమ వాళ్ళు ఆక్రమించడం నిజమే. ఆక్రమించిన స్థలాన్ని వాళ్లెందుకు వదులుతారు? కరవమంటే కప్పకి కోపం, విడవమంటే పాముకి కోపం.  జనాలు ఓట్లేసనేటప్పుడు డబ్బులు తీసుకోకుండా ఉంటే తామిలాంటి పనులు చేయాల్సిన అవసరం రాదు. ఏ చిన్న ఎలక్షన్ కి అయినా డబ్బుతోనే పని. ప్రతి సారి కోట్లకి కోట్లు ఎక్కడి నుంచి వస్తాయి. ఇలాంటి పనులే చేయాల్సివస్తుంది రాజకీయాల్లో గెలవాలన్నా, అనుచరగణం ని మెయింటెన్ చెయ్యాలన్నా.

అయితే అక్కడితో ఆ సంగతి వదిలేయాల్సింది తను. కానీ అక్కడే తెలివితక్కువ స్టెప్ వేశాడు. బృంద ముందు తన గుట్టు విప్పినందుకు కన్నెర్ర చేశాడు. మర్నాటికి స్థలం యజమాని మటుమాయం అయ్యాడు.

ఎలా తెలిసిందో బృంద కి. తన వద్దకు వచ్చి ఒకటే మాట అంది ఆ రోజు.

"డబ్బు కోసం, పదవుల కోసం నువ్వు ఇంత దిగజారి పోతావు అనుకోలేదు. నిన్ను చూస్తుంటే అసహ్యం, జాలి రెండూ కలుగుతున్నాయి"

అంతే, ఆ రోజు నుంచి తనతో మాట్లాడటం మానేసింది. కొడుకు ని హాస్టల్ లో చేర్పిన్చింది, తనను చూస్తూ పెరిగితే తనలా అవుతాడేమో అని అంట.

హాస్టల్ లో చేర్చాలని ఆమె నిర్ణయించుకున్న రోజు పెద్ద రభస జరిగింది. అప్పటికి తమ కొడుకు అభి వయసు పదేళ్లు ఉంటాయి. వాడు వెళ్లనని భోరు, భోరున ఏడ్చాడు.

"మనిద్దరి మధ్య గొడవకి వాడిని ఎందుకు బలి చేస్తున్నావు?" అన్నాడు తనా రోజు.

ఒక సారి తన వైపు చూసి మొహం తిప్పుకుని అంది.

"ఇక్కడే ఉండి నీ పనులు చూస్తూ పెరిగితే విలువలు, పాడూ ఏమీ లేకుండా గొడ్డు పెరిగినట్లు గా పెరుగుతాడు. నాకది ఇష్టం లేదు."

కళ్ళల్లో త్రుణీకారభావం స్పష్టంగా కనపడుతోంది.

అంటే తను గొడ్డా? ఉక్రోషం వేసింది.

అడిగితే అవునంటుందేమో అని భయం.

"నువ్వు ఖాళీ గానే ఉంటావు కదా. నా లాగా అవకుండా జాగ్రత్త గా పెంచుకోవచ్చుగా." అన్నాడు.

తన వాదన లో పస లేదని తనకే అర్థం అవుతూనే ఉంది.

"నన్ను మాత్రం నువ్వు ఎన్నాళ్ళు ఉంచుతావో నాకు అనుమానమే. అలా కాకపోయినా నీతో నేను ఎన్నాళ్ళు ఉండగలనో నా మీద నాకు సందేహం." ఒక్కొక్క మాట తూటా లాగా తగులుతోంది.

ఇక లాభం లేదు. గొంతు పెంచబోయాడు. అప్పుడే అభి వచ్చాడు.

"నేను హాస్టల్ కి వెళ్తానులే నాన్నా. మీరు గొడవ పడకండి"

ఏదో వాడిని అడ్డం పెట్టుకొని అన్నా ఒక్క వాదన లో గెలుద్దామంటే అడ్డం పడ్డాడు వెధవ. వాళ్ళమ్మ లాగే పుట్టుక తో వృద్ధుడు.

గొడవ పడొద్దట. అన్నీ ముదురు మాటలు.

అభి పెద్దయిపోతున్నాడు. ఎప్పుడన్నా సెలవులకి వచ్చినప్పుడు చూడటమే. అప్పుడు కూడా తనెక్కువ ఇంట్లో ఉండడు కాబట్టి వాడితో ఏదో బంధం తెగిపోయినట్లు అనిపిస్తుంటుంది. ఇప్పుడు వాడు అమెరికా లో అండర్ గ్రాడ్ చదువుతున్నాడు.

ఇన్ని కబుర్లు చెప్తుంది. ఏం, కొడుకు ని ఇండియా లోనే ఉంచి చదివించొచ్చుగా. మళ్లీ అట్లా కుదరదు.

ఒక్కోసారి కక్ష తీరేలా ఆమెని తిట్టాలనీ,  అరవాలనీ అనిపిస్తుంది. కానీ ఆమెతో ఎటూ వాదన లో గెలవలేడు. ఎందుకు అనవసరంగా పరువు పోగొట్టుకోవడం అని అన్నిటికీ నోరు మూసుకుని తనే అడ్జస్ట్ అయిపోతున్నాడు. తన మీద తనకే జాలేస్తోంది.

ఆమె అంటే తనకి భయం అని తెలిస్తే తన అనుచరులు ఏమవుతారో.

అభి కూడా చానాళ్లు గా తనతో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నాడు.

తన మీద ఏమైనా చాడీలు చెప్పి ఉంటుందా?

లేదులే, బృంద అటువంటి మనిషి కాదు. ఆమె వ్యక్తిత్వం తలుచుకునప్పుడు అతనికి కొద్దిగా గర్వంగా కూడా అనిపిస్తుంది.

ట్రోఫీ గెలిచిన వాడికి కలిగే ఆనందం.

ఈ సంఘటన జరిగినప్పుడు డ్రామా చేసింది కానీ కొన్నాళ్లకి దారిలో కి వస్తుందిలే అనుకున్నాడు. కానీ దాదాపు పదేళ్ళు దాటినా మౌనం వీడలేదు. ఒక్క మాట మాట్లాడదు.

ఒకోసారి ఆ మొండి తనానికి ముచ్చట వేస్తుంది కూడా.
***
విష్ణు ని పిలిచింది బృంద.

టాబ్లెట్స్, మంచి నీళ్ళు ఉన్న ట్రే అతనికి ఇచ్చి సుధీర్ కి ఇమ్మని సైగ చేసింది.
మాట్లాడకుండా మింగాడు వాటిని సుధీర్.

ఆమె దగ్గర తనకు నోరు పెగలదు. పోలీసులని చూసి దొంగలు, దేవతల్ని చూసి రాక్షసులు, పరమ స్ట్రిక్ట్ బాస్ ని చూసి పని చేయని ఉద్యోగి, సోషల్ మీడియా ని చూసి పొలిటీషియన్లు ఎలా భయపడతారో తనలో అటువంటి భయమే ఉంది ఆమెని చూస్తే.

ఈ విష్ణుగాడికి ఆమె అంటే మహా భక్తి. తను ఆమె పుట్టింటి తరపు నుంచి వచ్చిన వాడిలా ఫీల్ అయిపోతుంటాడు. మదాలస ని చూసినప్పుడల్లా ముందు వీడి మొహం మాడిపోతుంది.

అతని ఆలోచనలు కంట్రోల్ లేకుండా, ఒక దానితో ఒక దానికి సంబంధం లేకుండా ఒక దాన్నుంచి మరో విషయం లోకి వెళ్లిపోతున్నాయి.

మదాలస...తెల్లటి కొండచిలువ లాంటి మదాలస గుర్తు రాగానే పెదవుల మీద నవ్వు కదలాడింది అతనికి.

ఎప్పుడూ శ్రద్ధ గా అలంకరించుకుని ఉంటుంది. ఆమె శరీరం లో మేకప్ కానీ, నగ కానీ లేని భాగం ఉండదు. "తన మీద ఎంత ప్రేమ లేకపోతే అంత సమయం తన కోసం రెడీ అవటానికి వెచ్చిస్తుంది?!" ఒకసారి తనకు తెలియకుండానే పైకి అనేశాడు.

"మీకు అలా అర్థం అయిందా సార్? మేకప్ లేకుండా చూస్తే మీరు భయపడి పోతారనీ, మీ నుంచి రాబట్టేవి రాబట్టడం కష్టం అవుతుందని ఆమె తాపత్రయం."

విష్ణు ఒకసారి తన పక్కనే నిలబడి గొణిగాడు.

"ఏమిటి అంటున్నావు?" అన్నాడు తను.

"నేనేమీ అనలేదు సార్!"అన్నాడతను.

అంటే అతని అభిప్రాయాన్ని తనలా ఊహించుకున్నాడా?

లేదు...లేదు...అనే ఉంటాడు.

బృంద కి వీరవిధేయుడు.  తనకి మద్ధతు ఇచ్చేవాళ్ళు ఎవరూ లేరు ఇంట్లో. బృంద ప్రతిపక్షం లో ఉంటే ఇంట్లోంచి తనకు ఒక్క ఓటు కూడా పడదు.

ఏముంది ఆమెలో. తన భార్య అని అందరూ ఆమెతో అతి వినయం వొలకబొస్తారు. దానిని తన గొప్పతనం కింద బృంద ఫీల్ అయిపోతోంది.

ఎప్పుడు చూసినా మోచేతుల వరకూ కాటన్ జాకెట్లు, జరీ లేని అంచు చీరలు. సహజంగా అందగత్తె కాబట్టి సరిపోయింది. లేకపోతే ఆమెని తన ఇంట్లో పని మనిషి అనుకుంటారు. అన్నీ ముసలమ్మ వేషాలు. అవే పెద్ద ప్రిన్సిపుల్స్ అనుకుంటుంది.

ఈమె వయసు ఎంత అనుకుంటారో జనాలు. కుతూహలం కలిగింది అతనికి.

ఒకసారి తమ చుట్టాలబ్బాయి, అతని ఫ్రెండ్, తనని కలవడానికి ఇంటికి వచ్చారు.

తనక్కడే సోఫాలో కూర్చుని ఉన్నాడు. వాళ్ళు తనని చూడలేదు. అటుగా వెళ్తున్న బృంద వాళ్ళని పలకరించింది.

"ఆంటీ, అన్న ఎక్కడ?" అడిగారు వాళ్ళు. తన వైపు చూపించి తప్పుకుంది అక్కడ నుంచి.

తను ఆమె కంటే నాలుగేళ్లు పెద్ద. తను అన్న, ఆమె ఆంటీ. చచ్చేంత నవ్వొచ్చింది సుధీర్ కి. అదే మొదటి సారి బృంద మీద గెలిచిన ఫీలింగ్.
***
స్టేడియం ని సమీపించారు.

విష్ణు తన సెక్యూరిటీ వాళ్ళతో మాట్లాడుతున్నాడు. వాళ్ళు చెక్ చేయటానికి వెళ్లారు. అదంతా ఒక 10 నిమిషాల తతంగం.

బృంద కావాలని కక్ష సాధింపు కోసం అలా ప్రవర్తిస్తుంది అనిపిస్తుంది అప్పుడప్పుడూ. వచ్చేముందు టాబ్లెట్స్ వేసుకోటానికి తాగిన నీళ్ళ వల్లే బాత్ రూం కి వెళ్లాల్సిన అవస్త కావచ్చు.

నిన్న టీవీలో ప్రతిపక్ష నాయకుడు తనని రాజీనామా చెయ్యమని సవాల్ చేస్తున్నాడు. వాళ్ళు రోజు ఏదో ఒక కారణం చెప్పి రాజీనామా చెయ్యమనటం, తాము ప్రతిసవాళ్లు విసిరి నిరూపిస్తే ఇరవై నాలుగు గంటల్లో రాజీనామా చేస్తామనటం.  ఇలాంటివి అనటానికి, వినడానికి చాలా సిల్లీగా అనిపిస్తాయి. ఎన్నిటికో తెగించి, బరి తెగించి రాజకీయాల్లోకి వచ్చి పదవులు సంపాదించే తాము ఎవరో విసిరే ఛాలెంజ్ లకి రాజీనామాలు చేస్తారా? ప్రాణం పోయినా పదవులు పట్టుకు వేలాడటమే. పిచ్చి జనాలు ఈ గిమ్మిక్లను ఎలా నమ్ముతారో.

బయట ప్రెస్ వాళ్ళు వెయిట్ చేస్తున్నారు తోడేళ్లలా.

ఏదో రోడ్లు విషయంలో స్కాం జరిగిందని తన వెంట పడ్డారు ఉన్నట్లుండి. వీళ్ళు ఏ విషయంలో ఎందుకు రచ్చ చేస్తారో వాళ్ళకే తెలీదు. రోడ్లు ఒక్కటేనా? డ్రైనేజ్ లు, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వెళ్లే నిధులు, భవన నిర్మాణ కాంట్రాక్టులు - కుంభకోణం ఏ విషయంలో జరగటం లేదు? ఇదొక్కటే వీళ్ళకి కొత్తగా తెలిసినట్లు.

తన మీద ఏదో కుట్ర జరుగుతున్నట్లుగా అనిపిస్తుంది అప్పుడప్పుడూ.

***

సెక్యూరిటీ క్లియరెన్స్ తర్వాత బాత్ రూం కి వెళ్లి వచ్చాడు.

స్కూల్ పిల్లలకి స్కాలర్షిప్ లు ఇచ్చే ప్రోగ్రాం అది. చిన్న పిల్లలు ఏవో సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నారు.  తన సిబ్బంది హడావిడి ఒక వేపు. ముఖ్యమంత్రి గారు త్వరగా వెళ్లాలి కాబట్టి స్కాలర్షిప్ లు ఇచ్చేసి వెళ్ళిపోతారు కానివ్వండి అంటూ.

ఈ ప్రోగ్రాంలో అన్నా ప్రశాంతం గా కూర్చుందామనుకున్నాడు. మధ్యలో వీళ్ల గోలేంటి.

ఇప్పుడు ఆఫీస్ కి వెళ్లి తను పీకేదేముంది? చికాకు వేసింది.

అన్నీ తను కంట్రోల్ చేస్తున్నట్లు ఉంటుంది చూసేవాళ్ళకి. కానీ ఏదీ తన కంట్రోల్ లో ఉండదు.

తిక్క తిక్కగా ఉంది సుధీర్ కి. బీపీ పెరిగిపోతోంది. ఏదో సంచిలో తన శరీరాన్ని కుక్కేసినట్లు ఊపిరి ఆడట్లేదు. ఈ పరిస్థితులకు, పరిసరాలకు దూరంగా పారిపోవాలనిపిస్తోంది.

 ఒక టీచర్ పేర్లు ప్రకటిస్తుండగా విద్యార్థులకి స్కాలర్షిప్ లు ఇచ్చాడు. అందులో కూడా పార్షియాలిటీలు. స్పష్టంగా తెలిసిపోతుంది. టీచర్ ల పెట్ స్టూడెంట్స్ కి అధిక ప్రాధాన్యత కనపడుతూనే ఉంది.

ప్రతి ఫీల్డ్ లో ఉన్నదే ఈ అవినీతి, ఆశ్రిత పక్షపాతం - రాజకీయాలకి పడి ఎందుకు
ఏడుస్తారు...

పిల్లలు తనతో ఫొటోస్ దిగటానికి పోటీలు పడ్డారు.

మళ్లీ కాన్ఫిడెన్స్ పెరిగినట్లు అనిపించింది అతనిలో.

ఈ గుర్తింపు కోసమే కదా తను ఎంతో కష్టపడి ఈ స్టేజ్ కి వచ్చింది. దీని కోసమే కదా విలువల్ని తుంగలో తొక్కి, అడ్డమైన వాళ్ళ కాళ్ళు పట్టుకుని ఇక్కడ వరకూ వచ్చాడు. ప్రెస్ ని ఎదుర్కొనే సత్తా తనలో ఉందనిపించింది.

***

స్టేజ్ దిగుతుండగా ప్రెస్ చుట్టుముట్టింది. కింద పడబోయినంత పనయింది. తనని కదలకుండా చుట్టు ముట్టి వాళ్ళ ఇంట్రోడక్షన్ మొదలెట్టారు.

"ఇప్పుడు మీరు ఎవరినైతే చూస్తున్నారో ఆయన మన ముఖ్యమంత్రి. మన సీఎం మొహంలో కనపడుతున్నది ఏమిటి? దిగులా? దిగ్భ్రాంతా? మనం ఇదివరకే ఒక సారి మాట్లాడుకున్నట్లు ఓడలు బళ్ళు అవుతాయి...బళ్ళు ఓడలు అవుతాయి. మరి ఇప్పుడు మన ముఖ్య మంత్రి ఏం కాబోతున్నారు. బడా? వోడా?"

ఎక్కువ సేపు స్క్రీన్ స్పేస్ కోసం ఏదో వాగుతుంటారు వాళ్ళు. దిగ్భ్రాంతి ఎందుకు? నీ మొహం చూశా? తిట్టుకోసాగాడు తనలో తనే సుధీర్.

పళ్ళన్నీ తెరిచి మొహంలో మొహం పెట్టి ఒక జర్నలిస్ట్ మొదలెట్టింది.

"సర్, మీరు ఎంతో కష్టపడి ముఖ్యమంత్రి అయ్యారు. గ్రౌండ్ లెవెల్ నుంచి ఇక్కడి వరకూ వచ్చారు. ఇప్పుడు మీకేం అనిపిస్తుంది?"

"నీ బొంద... సడెన్ గా ఇవ్వాళ అనుకోటానికి ఏముంది?  అసలది ఒక ప్రశ్నా?" తిట్టుకున్నాడు.

కానీ రాజకీయాల్లో వాళ్ళు ఏది అడిగినా ఏదో ఒక సమాధానం చెప్పటానికి ట్యూన్ అయిపోయి ఉంటారు.

"ఏముందమ్మా, చాలా సంతోషంగా ఉంది. నేటి బాలలే రేపటి పౌరులు. వీళ్ళు చక్కగా చదువుకుని స్కాలర్షిప్ లు అందుకుంటుంటే చాలా ఆనందంగా ఉంది...రేపు వీళ్ళ లోనే ఒక సత్య నాదెళ్ల, ఒక అబ్దుల్ కలాం తయారు అవొచ్చు...."

మళ్ళీ కెమెరా లో మొహం పెట్టి చెప్పిందామె.
"ముఖ్యమంత్రి గారితో ఎక్స్ క్లూసివ్ మన ఛానల్ లో మాత్రమే"

చుట్టూ ఉన్న వాళ్లంతా మొహాలు చూసుకున్నారు. అందరూ అక్కడే ఉండి అన్ని చానల్స్ వాళ్ళకి దొరుకుతున్న ఇంటర్వ్యూ ఎక్స్ క్లూసివ్ ఎలా అవుతుంది?

బుర్ర గోక్కుంటూనే అందరూ ప్రశ్నలు మొదలెట్టారు.

"మీరు మొత్తం రోడ్లన్నీ వేయించామన్నారు. మీ పరిపాలన లో ఎనభై శాతం రోడ్లు పూర్తి అయ్యాయన్నరు. కానీ ఆ కాంట్రాక్టుల్లో మీరు భారీగా అవినీతి చేశారని మీ మీద ఆరోపణ. దీనికి మీ సమాధానం ఏమిటి?"

"రాజకీయ నాయకుల మీద ఇలాంటి ఆరోపణలు సహజమేకదా." మృదువుగా నవ్వాడు సుధీర్.

"ఆరోపణలు అందరూ చేస్తారు. రుజువు చేయమనండి." అన్నాడు మళ్ళీ.

"ఇది చూడండి." మరో ఛానెల్ అతను ఫోన్ లో వీడియో చూపించటం మొదలెట్టాడు.

సిటీ లో ఉన్న ప్రధానమైన రోడ్లు, కూడళ్లు అన్నీ గుంటలు పడి, పెచ్చులు లేచిపోయి, కొన్ని చోట్ల మురుగు నీరు నిండి కనపడుతున్నాయి.

"ఇప్పుడు ఏమంటారు?" అడిగాడు.

అతణ్ణి తేరిపార చూసాడు సుధీర్. ప్రతి వెధవకి సెల్ ఫోన్, సోషల్ మీడియా అకౌంట్. పనులు చేసుకోకుండా సన్నాసి వీడియో లు తీయటం, ఫేస్ బుక్ లో అప్లోడ్ చెయ్యటం.

ప్రభుత్వం లో ఉంటే తెలుస్తుంది. పరిపాలన లో ఎన్ని కష్టాలు ఉంటాయో.

తడుముకోకుండా సమాధానం ఇవ్వటం మొదలెట్టాడు సుధీర్.
"ఇది ఇప్పటి పరిస్థితి కాదు. మాకు అధికారం రావటానికి ముందున్న రోడ్లు ఇవి."

"లైవ్ చూపించమంటారా?" అడిగాడు అతను. అతణ్ణి పట్టించుకోకుండా మరో ఛానెల్ జర్నలిస్ట్ వైపు చూసాడు సుధీర్.

"సర్, పోనీ లైవ్ కాదు. ఇది చూడండి" మళ్లీ ఇంకో వీడియో మొదలెట్టాడు ఇందాకటి అతను. అతని ఐడీ కార్డు వైపు చూసాడు. పేరు కనపడుతోంది. వాల్మీకి అట. ఫాన్సీ పేర్లు ఎక్కువ అయ్యాయి జనాలకి.

అతను చూపిస్తున్న రెండో వీడియో లో రోడ్డు కొత్తగా వేసినట్లుంది. దాని మీద ఒక మనిషి నడుస్తున్నాడు. నడిచినంత మేర రోడ్డు పోయి మట్టి కనపడుతోంది.

"వాటిని రోడ్లు అనరనీ, వొట్టిగా నల్ల రంగు ఊదించారని, నడిస్తే పోతుందనీ ప్రజలు అనుకుంటున్నారు" అన్నాడు వాల్మీకి.

"ఇవన్నీ గ్రాఫిక్స్. ఏదో సెన్సేషన్ కోసం ఇటువంటి న్యూస్ మానెయ్యవయ్యా. నువ్వు కావాలంటే క్రియేటివ్ గా రామాయణం రాసుకో...నీ పేరు కి బాగా సూట్ అవుతుంది!" వ్యంగ్యంగా అని ముందుకు కదిలాడు సుధీర్.

"ఇది మా ఛానెల్ ఎక్స్ క్లూసివ్" మళ్లీ పళ్ళన్నీ కనపడేలా కెమెరా ముందుకు దూకింది ఒక ఛానెల్ కి సంబదించిన ఆమె.

"ఆయన అందరి ముందూ చెప్పాడు. ప్రశ్నలు అడిగింది నువ్వు కాదు. మీ ఛానెల్ కి ఎందుకు ఎక్స్ క్లూసివ్ అవుతుంది" దెబ్బలాట కి దిగారు మిగతా వాళ్లు ఆమెతో.

అక్కడి నుంచి జారుకోబోయాడు సుధీర్.

వెనక నుంచి అడగటం వినిపిస్తోంది.
"మీ మీద అవిశ్వాస తీర్మానానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని మీకు తెలుసా? అతి త్వరలో మీ ప్రభుత్వం కుప్ప కూలిపోతుంది అంటున్నారు. మీరేమంటారు?"

ఇది షాక్ లాగే తగిలింది సుధీర్ కి.

ఇదన్న మాట తన మీద జరుగుతున్న కుట్ర.

ఊపిరి ఆడట్లేదు అతనికి.

లోపల అలజడి గా ఉంది. రక్తం కండరాలని, చర్మాన్ని చీల్చుకుని బయటకి వచ్చేలా ఉంది.

తన సిబ్బంది ప్రెస్ కి అడ్డం పడుతుండగా వెళ్లి కార్ లో కూర్చున్నాడు.

కార్ వెంటనే ముందుకి కదిలింది. మరు క్షణం అతను స్పృహ కోల్పోయాడు.

***

అదే రోజు...

టైమ్ రాత్రి పదవుతోంది. పుస్తకం చదువుతూ అప్పుడే నిద్ర లోకి జారుకుంటోంది బృంద. ఫోన్ మోగుతుంటే మెలకువ వచ్చింది ఆమెకి.

అవతల నుంచి విష్ణు...

ఈ టైమ్ లో విష్ణు ఎందుకు ఫోన్ చేస్తున్నాడు.

ఆందోళన గా ఉంది అతని గొంతు.
" మేడం, సీఎం గారు కనపడట్లేదు. ఏమయ్యారో తెలిట్లేదు" ఆదుర్దాగా అంటున్నాడు...

____***____

# Part - 2

బృంద కి నిద్రంతా ఎగిరిపోయింది.

"ఏం మాట్లాడుతున్నావ్? కనపడకపోవటానికి మామూలు మనిషా? సీఎం ఆయన...!!!"

"నిజం మేడం. చాలా ప్రయత్నించాం ఎక్కడున్నారో తెల్సుకోటానికి. ఆచూకీ తెలిట్లేదు"

"కిడ్నాప్ లాంటిదేమైనా...?" అడగటానికి భయం గా ఉందామెకి.

"లేదు. స్ట్రెస్ అంటున్నారు ఈ మధ్య. ఇవ్వాళ మీటింగ్ అయి కార్ ఎక్కగానే ఊపిరి ఆడట్లేదంటూ వెనక్కి వాలిపోయారు. డాక్టర్ ని తీసుకొచ్చాం. టెస్ట్ అయ్యాక డాక్టర్ కంగారేం లేదు... రెస్ట్ తీసుకోవాలి అని చెప్పి వెళ్ళాడు. తర్వాత కాసేపటికి ఏదో ఫైల్ మీద సర్ సంతకం కోసం లోపలకి వెళ్ళాను. లోపల లేరు"

" ఈ టెన్షన్లు భరించలేక కావాలని ఎటన్నా వెళ్లిపోయారని అనుమానంగా ఉంది" చెప్పాడు విష్ణు.

"ఎక్కడున్నావ్? అర్జంట్ గా ఆఫీస్ కి వచ్చేయి" అంది బృంద.

***

ఇంటి పై పోర్షన్ లోనే ఆఫీస్ సెటప్ ఉంది. లోపల నుంచి మెట్లున్నాయి. మరీ ముఖ్యమైన వాళ్ళు, బంధువులు తనతో ఏదైనా పని పడి వచ్చినప్పుడు వాళ్ళని ఇంటికి రమ్మంటాడు సుధీర్. పెళ్ళిళ్ళకి పిలవడానికి, ఏదైనా ఫంక్షన్ లకి ఆహ్వానించటానికి వచ్చేవాళ్ళు కూడా అక్కడకే వచ్చి అతణ్ణి కలుస్తుంటారు.

చాలా ఏళ్ళ తర్వాత ఆఫీస్ లోకి అడుగు పెట్టింది బృంద.

సుధీర్ రాజకీయాల్లోకి అడుగు పెట్టిన కొత్తలో ఆమె అతనికి సహాయపడేది. దగ్గరుండి తనే డిజైన్ చేసి కట్టించింది ఆఫీస్ ని. లోపల టీవీ, సోఫా లతో సహా అన్ని హంగులు ఉన్నాయి.

దానికి అనుబంధంగా ఆనుకుని మరో చిన్న రూం. అందులో నలుగురు స్టాఫ్ పని చేసుకోటానికి వీలుగా నాలుగు బల్లలు, కుర్చీలు ఉన్నాయి.

మదాలస విషయం బయటకి వచ్చినప్పటి నుంచీ తను అతని గురించి పట్టించుకోవడం మానేసింది. మళ్ళీ ఇప్పుడే రావటం.

పెద్ద మార్పు లేదు ఆఫీస్ లో. కాస్త పాతపడ్డది అంతే. విజిటర్స్ కోసం బయట సోఫాలు, కుర్చీలు వేసి ఉన్నాయి. రాత్రి పదకొండు దాటటంతో అంతా ఖాళీగా ఉంది.

బృంద పైకి వచ్చేటప్పటికి లాబీ లో కూర్చుని వెయిట్ చేస్తున్నాడు విష్ణు. అతణ్ణి చూడగానే తీవ్రమైన టెన్షన్ లో ఉన్నాడని అర్థం అయింది.

జుట్టు రేగిపోయి చెమటలు కారుతున్నాడు. గోళ్ళు కొరుక్కుంటున్నాడు.

ఆమె ని చూడగానే లేచి నిలబడబోయాడు.  కూర్చోమని సైగ చేసింది బృంద.

మరో కుర్చీ లాక్కుని అతనికి ఎదురుగా కూర్చుంది.

"ఇప్పుడు చెప్పు. స్టాఫ్ అంతా సీఎం ఆఫీస్ లో ఉండగా ఎవరికీ తెలీకుండా ఎలా వెళ్ళారు?"

"మేడం, సర్ అప్పుడప్పుడు ఇలాగే వెళ్తుంటారు. మీకు తెలియంది ఏముంది?" చేతులు నులుముకుంటూ ఇబ్బంది గా అన్నాడు.

అతను చెప్తున్నది మదాలస గురించి అని అర్థమయింది ఆమెకి. అవమానం గా అనిపించింది. పోతే పోనీ, మళ్ళీ అతను తన కంటికి కనపడక పోవటమే మంచిది అనిపించింది ఆ క్షణాన.

కానీ చిన్నప్పటి నుంచి తెలిసిన వాడవటం, కొడుకు, కుటుంబాలు, బంధువులు గుర్తొచ్చారు ఆమెకి. తప్పదు...నిట్టూర్చింది.

"ఆమెకి ఫోన్ చేసావా? అక్కడికి ఏమన్నా వెళ్ళుంటాడా?" అడిగింది.

పేరు ఉచ్చరించటానికి కూడా ఆమెకి మనసు ఒప్పలేదు.

"ఇంత సేపు అక్కడ ఉంటే ఆవిడ మొహం మేకప్ లేకుండా చూసి ఎప్పుడో దారిలోకి వచ్చేవారు" వెటకారంగా అన్నాడు.

"ఫోన్ చెయ్యొకసారి" ఆజ్ఞాపిస్తునట్లు ఉంది ఆమె గొంతు.

కర్మ...ఈ పొలిటీషియన్ల దగ్గర ఉద్యోగాలేమో కానీ అడ్డమైన వాళ్ళకీ ఫోన్లు చేయాల్సి వస్తుంది. తూ నా బతుకు.

తిట్టుకుంటూ తప్పనిసరై ఫోన్ అందుకున్నాడు.

"హల్లో!" వయ్యారంగా, దర్పంగా ఉంది గొంతు. తనే ప్రైమ్ మినిస్టర్ ని అన్నంత బడాయి గా ధ్వనిస్తుంది.

" నేను విష్ణు ని. సుధీర్ సర్ ఏమయినా అక్కడికి వచ్చారా?"

"ఇవాళ రాలేదు. ఇంకెప్పుడూ రాత్రుళ్ళు ఫోన్ చెయ్యకు" ఫోన్ పెట్టేసింది మదాలస.

పతివ్రత మరి.. గొణుక్కొంటూ ఫోన్ పక్కన పెట్టాడు.

విష్ణు మొహం చూసి బృంద కి జాలేసింది. అప్పటికే అతను ఆమె వైపు జాలిగా చూస్తున్నాడు.

మరి కొంత మందికి ఫోన్లు చేసి చూసారు.

మరీ ఎక్కువ మందికి ఫోన్లు చేసినా విషయం లీక్ అవుతుంది. ఇదే సందని ప్రతిపక్షం వాళ్లు ప్రభుత్వాన్ని కూల్చేస్తారు. ఎమ్మెల్యేలు గోడ మీద కూర్చుని జంపింగ్ కి రెడీ గా ఉన్నారు అసలే.

అప్పుడు వచ్చింది ఆమెకి  సుధీర్ నుంచి మెసేజ్.

"నేను కొన్నాళ్ళు బ్రేక్ తీసుకుంటున్నా. ఈ స్ట్రెస్ నేను తట్టుకోలేక పోతున్నా. నా కోసం వెతకటానికి ప్రయత్నించ వద్దు. నేను ఏం చేయాలనేది ఆలోచించుకునే వరకూ నువ్వే ఎలాగో మేనేజ్ చేయి ప్లీజ్"

వెంటనే అతనికి ఫోన్ చేయటానికి ప్రయత్నించింది బృంద. మెసేజ్ పంపి ఫోన్ ఆఫ్ చేసినట్లున్నాడు.

"ఒక్క రోజు గడువు ఇవ్వు. నేను తీసుకొస్తాను." విష్ణు తో అంది బృంద.
***
మర్నాడు పగలు పన్నెండు అవుతోంది.
చాలా సార్లు సుధీర్ కి ఫోన్ చేసింది బృంద. అవతల నుంచి రెస్పాన్స్ ఉండట్లేదు. ఫోన్ ఆఫ్ అన్నా ఉంటోంది. లేకపోతే ఎన్ని రింగ్స్ వచ్చినా ఎత్తటం లేదు.

"Escapist" అనుకుంది బృంద. రాదల్చుకోలేదనుకుంట ఇప్పుడే. ఏదో గట్టిగా నిర్ణయించుకున్నట్లు ఉన్నాడు. ఎంత పట్టించుకోకుండా వదిలేద్దాం అనుకున్నా నెత్తి మీదకు ఏదో ఒకటి తెచ్చి పెడతాడు.

విష్ణు కి ఫోన్ చేసింది. "డ్రైవర్ ని కార్ రెడీ చేయమను. బయటికి వెళ్లాలి. నువ్వు కూడా నాతో రావల్సి ఉంటుంది. అరగంట లో ఇక్కడ ఉండండి"

"సరే మేడం" వినయం గా సమాధానమిచ్చాడు విష్ణు.

బృంద రెడీ అయి బయటకి వచ్చేసరికి కార్ రెడీ గా ఉంది.

ఆమెని చూసి పరిగెత్తుకొచ్చి వెనక డోర్ తెరిచి పట్టుకున్నాడు డ్రైవర్ రాములు.

"ఎన్ని సార్లు చెప్పినా నువ్వింతేనా? డోర్ తెరిచి నువ్వు పట్టుకొనక్కర్లేదు. నేను తీసుకోగలను." ఇంకో వైపు నుంచి ఎక్కి కూర్చుంది ఆమె. విష్ణు డ్రైవర్ పక్క సీట్ లో కూర్చున్నాడు అప్పటికే.
బుర్ర గోక్కుంటూ కార్ స్టార్ట్ చేసాడు డ్రైవర్. బృంద అడ్రస్ చెప్పాక కార్ ముందుకు కదిలింది.

నగర శివార్లు దాటి ముందుకు వెళ్తోంది కార్.

"ఏంటి రోడ్లు ఇట్లా ఉన్నాయి?" ఆశ్చర్యంగా అడిగింది బృంద.

రోడ్లన్నీ తవ్వి పోసినట్లు ఉన్నాయి. అక్కడక్కడా నీరు నిలిచిపోయి, మధ్యలో గుంటల తో భీభత్సంగా ఉన్నాయి రోడ్లు. కార్ వేగంగా వెళ్ళటానికి వీల్లేకుండా ఉంది.

ఆ రోడ్డు మీద ప్రయాణిస్తే ఏ ఆరోగ్య సమస్యలు లేనివాళ్ళకి ఆర్థరైటిస్ లాంటివి మొదలయ్యేలా ఉన్నాయి.

"ఏం చెప్తాం మేడం. ఇప్పటికి రెండు సార్లు ఈ దారి వెంట రోడ్డు వేశాం." అన్నాడు విష్ణు.

"రెండు సార్లు వెయ్యడం ఏంటి?" కుతూహలంగా ఉంది బృంద కి.

"ఏముందమ్మా? రోడ్లు వేశాక టెలిఫోన్ లైన్లు అనో, డ్రైనేజ్ లు అనో వేరే డిపార్ట్మెంట్ వాళ్లు వీళ్ళు వేసిన రోడ్లు తవ్వేస్తారు." రాములు అన్నాడు.

"ఇక్కడ ఏం డ్రైనేజీలు... హైవే మీద?" అడిగింది బృంద.

"ఇది అలా జరిగింది కాదండీ. కాంట్రాక్టర్ ల మోసం" అన్నాడు విష్ణు.

"సార్, అంటే అన్నానంటారు కానీ ఒకసారి కాంట్రాక్టర్ మోసం చేస్తే మళ్ళా వాళ్ళకే ఎట్లా ఇస్తారు?" అన్నాడు రాములు.

నోటి దూల అతనికి. మనసులో అనిపించింది పైకి అనెయ్యకపోతే తోచదు.

"ఇప్పుడు అవసరమా అదంతా?" గుడ్లు ఉరుముతూ అన్నాడు విష్ణు.

"బయటి వాళ్ల దగ్గర కాదు కదా సార్. మనలో మనం అన్నా అనుకోకపోతే ఇంక నిజాలెట్లా తెలుస్తాయి" అన్నాడు రాములు.

విష్ణు ని పట్టించుకోకుండా మళ్లీ కొనసాగించాడు.

"స్టేట్ మొత్తం పరిస్థితి ఇదేనమ్మా. మన సీఎం సార్ ని తిట్టుకోని వాళ్ళు లేరు. అంతకు ముందు రోడ్లని అట్లాగే ఉంచేసినా పోయేది. డబ్బులు, కమీషన్ ల కోసం ఉన్న రోడ్డు మీదే మళ్లీ వేశారని చెప్పుకుంటారు. ఈ కాంట్రాక్టర్ ఏం మెటీరియల్ పెట్టి వేశాడో కానీ అంతకు ముందు ఉన్న రోడ్లు కూడా గునపం తో పైకి లాగినట్లు వచ్చేస్తాయి అంట"

"అట్లా అనుకుంటారు కానీ మన సార్ అట్లా చేస్తాడంటే నేను నమ్మను. మన సార్ దేవుడు" మళ్లీ తెలివిగా కలిపాడు.

బృంద కి నవ్వొచ్చింది. ఈ పొలిటీషియన్ ల చుట్టూ ఇటువంటి బ్రతకనేర్చిన జనాలు చేరతారు. అవసరాల కోసం వాళ్ళు చేసే భజనలకి, పొగడ్తలకు అలవాటు పడి వాస్తవ దూరమైన ప్రపంచంలో బ్రతుకుతూ ఉంటారు వాళ్ళు. పైగా తామేదో ప్రత్యేకమయిన వ్యక్తులనీ, తమ పుట్టుకే ప్రపంచానికి వరమనీ భావిస్తుంటారు. ఓడిపోయిన రోజు వాళ్ళకి తెలిసొస్తుంది. కానీ అప్పటికే ఆలస్యం అయి ఉంటుంది.

నగరానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్నారు వాళ్ళు. కుడి వైపు చిన్న పల్లెటూరు లాంటి ప్రాంతం కనిపిస్తోంది. అటు వైపు పోనిమ్మంది బృంద.

మట్టి రోడ్డు అయినా  శుభ్రం గా ఉంది. రోడ్డు కి రెండు వైపులా క్రమపద్ధతిలో పెంచిన చెట్లు. రెండు కిలోమీటర్ల వరకూ అదే దారిలో వెళ్లాక ఒక వైపుగా చిన్న పెంకుటిల్లు కనపడసాగింది. క్రమంగా ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ పూల మొక్కలు, కూరగాయల మడులు కనపడుతున్నాయి.

మధ్యాహ్నం నాలుగు అవుతోంది.

ప్రశాంతంగా ఉందా ప్రాంతం. పూల మొక్కల సువాసన, పక్షుల కువకువలతో ఆహ్లాదంగా ఉంది అక్కడ వాతావరణం.

కార్ ఆపమంది బృంద. రాములు ని అక్కడే ఉండమని, కార్ దిగి ఇంటి వైపు అడుగులు వేసింది. విష్ణు ఆమెని అనుసరించాడు.

"ఎవరైనా స్వామీజీ అశ్రమమా మేడం?" అడుగుతున్నాడు విష్ణు.

అతనికి వింతగా ఉంది. ఒక పక్కన బాస్ మిస్సింగ్. బృంద అసలేం జరగనట్టు, ఎప్పుడూ లేని విధంగా ఇక్కడికి ఎక్కడికో తీసుకొచ్చింది.  ఏమీ అర్థం కావట్లేదు అతనికి. మధ్య మధ్యలో ఫోన్లు వస్తున్నాయి అతనికి. సీఎం అప్పాయింట్మెంట్ కోసం. ఒక వారం వరకూ అన్నీ వాయిదా వేస్తున్నాడు బిజీ అని చెప్పి.

తర్వాత ఎలా...?

అసలీ తేడా గాడి దగ్గర ఉద్యోగం లో చేరటం తను చేసిన పెద్ద తప్పు. అటు ఇటు అయి, సెక్యూరిటీ లేక సీఎం కి ఏదైనా జరిగితే తన పీకలకి ఎక్కడ చుట్టుకుంటుందో అని భయంగా ఉంది అతనికి.

***

చిన్న నాలుగు గదుల ఇల్లది. ఇంటి ముందు పెద్ద వరండా. ముందు నాలుగు మెట్లున్నాయి.

రెండు వెదురు తో చేసిన కుర్చీలు వేసున్నయి వరండాలో. గుమ్మం వరకూ వెళ్లి లోపలకి తొంగి చూసింది. ఎవరూ లేరు. వెనక వైపు నుంచి మాటలు వినిపిస్తున్నాయి. అటుగా నడిచారు ఇద్దరూ.

వెనక వైపు మొక్కల మధ్య, సన్న జాజి తీగ పాకించిన పందిరి.  వాటి మధ్యలో వేసున్న వాలు కుర్చీ లో వెనక్కి జారగిలబడి పుస్తకం చదువుతున్నాడు ఒకతను.

అతణ్ణి చూడగానే ప్రాణం లేచొచ్చినంత పనయింది విష్ణుకి.

"హమ్మయ్య...ఇక్కడున్నారన్న మాట. నిన్న రాత్రి నుంచి టెన్షన్ తో చచ్చి పోతున్నాము అంటే నమ్మండి" గబగబ అతని దగ్గరకి వెళ్లి అన్నాడు.

ఎగాదిగా చూసాడతను విష్ణు వైపు. అప్పుడే వెనక నుంచి నవ్వుతూ చూస్తున్న బృంద కనపడింది.

ఆమెని చూసి పలకరింపు గా నవ్వాడతను. చక్కటి అమాయకమైన నవ్వు.

అసలతను సుధీర్ ఏనా?  బృంద, సుధీర్ మధ్య అటువంటి సఖ్యత తనెరగడు.

"ఏం ఇలా వచ్చావ్ బృందా? ఈ కొత్త పాత్ర ఎవరు?" అంటూ లేచి నిల్చున్నాడు అతను.

అయితే ఇతను సీఎం గారు కాదా? ఏదో కొంచెం తేడా కనపడుతోంది. ఇతను చాలా ఫిట్ గా ఉన్నాడు. పైగా మొహం లో అమాయకత్వం కనపడుతోంది. సుధీర్ అట్లా కాదు, అతని మొహంలోనే అతని మోసపూరిత గుణం కనపడుతూ ఉంటుంది. అతనెంత మంచి వాడిలా కనిపించటానికి ప్రయత్నించినా.

అయోమయంగా నిలబడ్డ విష్ణు భుజం మీద తట్టి చెయ్యి ముందుకు జాపి "ఐయాం కార్తీక్!" అన్నాడతను.

షాక్ లో ఉన్న విష్ణు అప్రయత్నం గానే చేయి కలిపాడు.

"అచ్చం సుధీర్ సార్ లాగే ఉన్నారు" గొణుగుతున్నట్లుగా అన్నాడు.

పెద్దగా నవ్వాడు కార్తీక్.

"సుధీర్ మా అన్నయ్య" చెప్పాడు.

"నువ్వేం మారలేదు" అంది బృంద నవ్వుతూ.

"మనలో ఎవ్వరం మారలేదు. మంచో, చెడో మనందరికీ బలమైన వ్యక్తిత్వాలు ఉన్నాయి మరి." అన్నాడు కార్తీక్.

"ఇందాక ఇతను టెన్షన్ లో ఉన్నాడేంటి? ఏదేదో మాట్లాడాడు." మళ్లీ అన్నాడు.

పనివాడిని పిలిచి కుర్చీలు వేయించాడు.

కూర్చున్నాక విషయం చెప్పింది బృంద.

మొత్తం విన్నాడతను.

"ఆశ్చర్యం గా ఉందే?  అన్నయ్య పదవి వద్దనుకుని ప్రశాంతత కోరుకుంటాడు అని నేనెప్పుడూ అనుకోను."

నిజంగానే అతనికి చాలా ఆశ్చర్యం గా ఉంది. గతం గుర్తొస్తోంది అతనికి.
***
పక్క పక్క ఇళ్లలో ఉండేవారు చిన్నప్పుడు తమ కుటుంబం, బృంద వాళ్ళ కుటుంబం.

తమది మామూలు మధ్య తరగతి కుటుంబం. బృంద వాళ్లు బాగా డబ్బున్న వాళ్ళు. ఆమె తాత ముత్తాతల కాలం నుంచి వాళ్ల కుటుంబం లో ఎవరో ఒకళ్ళు రాజకీయాల్లో ఏదో ఒక పాత్ర పోషిస్తూ వచ్చారట.  బృంద తండ్రికి మాత్రం  రాజకీయాలంటే ఆసక్తి లేక అవసరం లేకున్నా బ్యాంక్ ఉద్యోగం చేసేవాడు. తమ తండ్రులిద్దరికి ఆ బ్యాంక్ లోనే పరిచయం.  అతని ఇంటి పక్కనే ఉన్న ఇంటిని తమకి అద్దె కి కుదిర్చింది కూడా బృంద తండ్రే.

బృంద వాళ్ళింటికి ఎప్పుడూ ఎవరో ఒక ప్రముఖులు వస్తూ పోతూ ఉండేవారు. వాళ్ళను చూసీ చూసీ సుధీర్ కి రాజకీయాల పిచ్చి మొదలైంది. అలా వచ్చిన వాళ్ళని నోరు తెరుచుకుని చూస్తూ ఉండేవాడు సుధీర్. సుధీర్ ని చూసి తెగ నవ్వొచ్చేది తనకి.

తనకీ, సుధీర్ కీ సంవత్సరం తేడా. ఇద్దరూ ఒకేలా ఉండేవారు అచ్చు గుద్దినట్లు. ఎవరు ఎవరో తెలీక తమ తల్లి కూడా తికమక పడిన రోజులున్నాయి.

ఒక్క లతకి మాత్రం తెలిసిపోయేది ఎవరు ఎవరో. ఎన్ని సార్లు కన్ఫ్యూజ్ చేద్దాం అని చూసినా అస్సలు పొరబడేది కాదు.  "నువ్వు వేరే" అనేది ఆత్మీయంగా.

బృంద చెల్లెలు లత, తను మంచి స్నేహంగా ఉండేవారు. బోలెడన్ని ఆటలు. బృంద చెల్లెలు లత గుర్తొచ్చింది అతనికి. అవును, ఇప్పుడెలా ఉందో ఆమె. ఎక్కడ ఉందో.

ఆలోచనల్లో నుంచి బయట పడి లత గురించి అడిగాడు బృంద ని.

" ఇప్పుడు గుర్తొచ్చిందా?" చెల్లెలి పేరు ఎత్తేసరికి బృంద కళ్ళు తళుక్కుమని మెరిసాయి.

"నీకు తను గుర్తు ఉంటానని కూడా అది అనుకుని ఉండదు. ఇంకా అదే ఊళ్ళో ఉంది. అక్కడే స్కూల్ లో టీచర్ గా పని చేస్తోంది"

లత భర్త గురించి అడగాలనిపించింది కార్తీక్ కి.

అతను అడగకుండా తానెందుకు చెప్పాలి అనుకుంది బృంద. ఎంత మంచిదో అంత మొండిది!.

కార్తీక్ లో గతపు ఆలోచనలు కదలసాగాయి.

***

చిన్నప్పటి నుంచే బృంద హుందాగా ఉండేది. ఆమె అల్లరి చేయటం కానీ, పెద్దగా ఆటలు ఆడటం కానీ తానెప్పుడూ చూడలేదు. ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూ ఉండేది. అప్పుడప్పుడు చెల్లెల్ని గదమాయిస్తూ పెద్దరికం ప్రదర్శించేది. చదువులో అందరి కంటే ముందుండేది.

తను చదువు ని ఆమె అంత సీరియస్ గా తీసుకోకపోయినా బాగానే చదివేవాడు.

లత, సుధీర్ లకి చదువు మీద అస్సలు ధ్యాస ఉండేది కాదు.  సుధీర్ కాపీ లు కొట్టి, లత ముక్కి మూలిగి ఏదోలా డిగ్రీలు ముగించారు ఇద్దరూ.

అసలు సుధీర్ ని, బృంద పెళ్లి చేసుకుంటుందని తను ఏనాడూ అనుకోలేదు. పరస్పర విరుద్ధమైన వ్యక్తిత్వాలు వాళ్ళవి. వాళ్ల పెళ్లి లతకు అస్సలు ఇష్టం లేదు. అక్కకు నచ్చజెప్పాలని చాలా ప్రయత్నించింది.

"వినట్లేదు. ఆమె ఖర్మ. నేనేం చేయలేను" విసుగ్గా అంది లత తనతో.

తన అన్న ని తన ముందే తీసిపారేయటం తనకి నచ్చలేదు.

"మీ అంత ఆస్తులు లేవని తప్ప మా అన్నయ్య కి ఏం తక్కువని?" అన్నాడు.

ఎప్పుడూ లేనిది ఆ రోజు గొడవయింది లత తో.

తన సంగతి  తెలిసీ తనేదో డబ్బుకి ప్రాధాన్యత ఇస్తుందన్నట్లు మాట్లాడటం లత కి నచ్చలేదు.

ఆ రోజుతో తమ ఇద్దరి మధ్యా పెద్ద అగాధం ఏర్పడింది.
***
బృంద, సుధీర్ ల పెళ్లి అనుకోటానికి దాదాపు రెండు నెలల ముందు నుంచీ తనకీ, సుధీర్ కీ మధ్య ఏదో తేడా, అడ్డు పొర ఏర్పడ్డట్లుగా అనిపించేది. అది ఎందుకో, ఏమిటో చానాళ్ళ దాకా అర్థం కాలేదు.

తరచుగా సుధీర్ తన మీద కక్ష కట్టినట్లు ప్రవర్తించే వాడు. వీలు దొరికిప్పుడల్లా తన మీద కసి తీర్చుకోవాలన్నట్లుగా ప్రవర్తించేవాడు. ఇప్పటికీ అదే ధోరణి.

ఒక సంఘటన తనకు బాగా గుర్తు. మొట్టమొదట సారి తన మీద అతనికి ద్వేషం ఉందని బహిర్గతం అయిన సంఘటన.
***
సుధీర్ ఎమ్మెల్యే అయిన మొదటి సంవత్సరం.

కార్తీక్ సైకాలజీ లో ఎంఫిల్ చేస్తున్నాడు.

సాయంత్రం అయిదు అవుతోంది. చదువుతున్న బుక్ తీసి పక్కన పెట్టి, యూనివర్సిటీ లో క్రికెట్ మాచ్ ప్రాక్టిస్ కి వెళ్ళటానికి బట్టలు మార్చుకుంటుంటే బెల్ మోగింది.

తలుపులు తీసాడు. ఎదురుగా పోలీసులు.

ఆశ్చర్యంగా చూసాడు తను.

"స్టేషన్ కి పద" అన్నాడు ఒక పోలీస్.

"ఎందుకు?" అయోమయంగా అడిగాడు తను.

"మధ్యాహ్నం ఒకతన్ని చావ కొట్టినందుకు"

ఇంతలోకి కార్తీక్ తల్లి అక్కడికి వచ్చింది.

"వాడు ఇంట్లోనే ఉన్నాడు మధ్యాహ్నం. వాడు ఎవరో తెలుసా? ఎమ్మెల్యే సుధీర్ తమ్ముడు."

ఒక కొడుకు పదవి పేరు చెప్పి రెండో కొడుకు ని కాపాడే ప్రయత్నం చేసిందామె.

ఆమెని చూసి జాలి గా నవ్వి చెప్పాడు పోలీస్
"సార్ అనుమతి తీసుకునే వచ్చాం అమ్మా. అన్ని ఆధారాలు ఉన్నాయి"

ఇంట్లో ఉన్న వాడు ఏదో చేసాడు అని అడ్డగోలుగా అభియోగం మోపి తీసుకెళ్తుంటే ఏమి చేయలేక చేష్టలుడిగి చూస్తుండి పోయింది తల్లి.

పోలీసులు ఆధారాల కింద ఒక వీడియో ని ప్రొడ్యూస్ చేశారు. అందులో తను ఒకడిని చావ చితక్కొడుతున్నట్లుగా ఉంది. సరిగ్గా చూస్తే ఆ మనిషి తను కాదనీ, సుధీర్ అనీ తమ ఇద్దరినీ బాగా తెలిసిన వాళ్ళ కి మాత్రమే అర్థం అవుతుంది.

ఆలోచన లో పడ్డాడు కార్తీక్. ఒకవేళ అనుకోకుండా ఇరుక్కున్నాడేమో సుధీర్. పొలిటికల్ కెరీర్ కి ఇబ్బంది కాబట్టి తాము ఒకేలా ఉంటాము కాబట్టి తనని అడ్డం పెట్టుకొని తప్పించుకోవాలనుకున్నాడేమో?

అదే అయితే ఇంత డ్రామా అవసరం ఏముంది? తనకి ఒక్క మాట చెప్పి ఉంటే తనే చేశానని వొప్పేసుకునేవాడు కదా.

అయోమయంలో వుండగానే తన మీద  అయిదారు కేసులు పెట్టి రెండు నెలలు జైల్లో కి తోసారు.

జైల్ బయటికి వచ్చాక స్నేహితుల ద్వారా తనకి తెలిసింది ఏమిటంటే.
తన మీద కేస్ పెట్టింది సుధీర్ అనుచరుల్లో ఒకడట.

"ఇదంతా నీ మీద కుట్ర రా. నిన్ను తప్పించమని అడగటానికి వెళ్ళిన మీ అమ్మా,నాన్నల్ని ఎన్ని మాటలు అన్నాడో తెలుసా? చిన్నప్పటి నుంచీ వాళ్ళకి నీ మీదే ప్రేమ ఎక్కువనీ, వాళ్ల గారాబం వల్లే నువ్వు చెడి పోయావనీ, ఇప్పుడు కూడా నీ పనుల వల్ల తనకి చెడ్డ పేరొస్తున్నా తన గురించి ఆలోచించకుండా నీ కోసం సహాయం అడుగుతున్నారనీ ఇలా చాలా మాటలు అన్నాడు".

"సుధీర్ స్వార్థపరుడు అనే విషయంలో ఎవరికీ సందేహం లేదు కానీ, నీ మీద ఇంత కుట్రపూరితంగా వ్యవహరిస్తాడు అని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు. ఆ రోజు అర్థం అయింది" అన్నాడు ఒక స్నేహితుడు.

"పెద్ద కొడుకు చిన్న వాడికి సహాయపడలేదనే బాధ ఒక వేపు, కొడుకు పదవి లో ఉండగా వేరే వాళ్ళని సహాయం అడిగితే అతను చులకన అయిపోతాడు అనే భయం ఇంకో వేపు మధ్య నలిగిపోయారు మీ అమ్మానాన్నలు. నువ్వు తప్పు చేయలేదని తెలిసీ, ఏమీ చేయలేక వాళ్ళెంత కుమిలి పోయారో నీకు తెలియదు".

నీ మీద ఏదో మనసులో పెట్టుకున్నాడు రా మీ అన్న.  పదవి లో ఉన్న వాళ్ల తో పెట్టుకోవాలి అంటే నువ్వూ రాజకీయాల్లోకి అన్నా పోవాలి. లేదా వాళ్ళకి దూరంగా విదేశాలకి అన్నా పోవాలి" ఆవేశంగా అన్నాడొక స్నేహితుడు.

"నీ మొహం" పెద్దగా నవ్వేశాడు తను ఆ రోజు. చిన్న విషయాన్ని పెద్దగా చేయవద్దనీ, ఆ విషయం అక్కడితో వదిలేయమనీ గట్టిగా చెప్పాడు వాళ్ళతో.
***
జైల్ నుంచి బయటికి వచ్చాక నానా తంటాలు పడి మళ్లీ చదువు మొదలెట్టాడు.

ఇంతలో మరో సంఘటన. కొడితే మళ్లీ లేవకుండా కొట్టాలనే సూత్రాన్ని వంట పట్టించుకున్నట్లున్నాడు సుధీర్. ఈ సారి చాలా స్పష్టంగా అర్థమైంది కార్తీక్ కి.
ఏ కారణం లేకుండానే సుధీర్ తన మీద కక్ష  పెంచుకున్నాడని తనకి బాగా తెలిసొచ్చేలా చేసిన సంఘటన అది.

ఎంఫిల్ పూర్తి చేసి ఓటమి కి, డిప్రెషన్ కి సంబంధించిన సబ్జెక్ట్ మీద పి హెచ్ డి చేస్తున్న రోజులు అవి. థీసిస్ ఆ రోజే సబ్మిట్ చేసి ఇంటికొచ్చాడు. రోడ్డు మీద ఎవరినో కనపడగానే తనతని మీద దాడి చేశాడని, ఆ వ్యక్తి చనిపోయాడని  పోలీసులు పట్టుకెళ్ళారు.  మధ్యలో ఏమైందో ఏమో తనని రకరకాల పరీక్షలకు గురి చేసి తన మానసిక పరిస్థితి బాగా లేదని మెంటల్ హాస్పిటల్ లో పడేశారు.

ఆ టైమ్ లో సుధీర్ వచ్చి కలిశాడు.
"నేను నీకు సహాయం చేయట్లేదని అనుకుంటారు అందరూ. జైల్ శిక్ష కనీసం పదమూడు ఏళ్లు పడేది. అది తప్పించటానికే ఇలా పిచ్చని మేనేజ్ చేయాల్సివచ్చింది. ఇందుకు ఎంత కష్టపడ్డానో తెలుసా?" చెప్తున్నాడు సుధీర్.

నవ్వొచ్చింది తనకి.

అక్కడ నుంచి లేచి వెళ్ళిపోయాడు. ఇంకా అక్కడే ఉంటే అతడిని కొడతానేమో అని తన మీద తనకే అనుమానం కలిగింది.

ఇక ఆ హాస్పిటల్ లో పిచ్చి వాళ్ళ మధ్యన, డాక్టర్స్ ఇచ్చే నానా రకాల ట్రీట్మెంట్ లతో మానసికంగా, శారీరకంగా చాలా బలహీనంగా పడిపోయాడు.

పీ హెచ్ డీ కి సంబంధించిన సబ్జెక్ట్ మీద చేసిన పరిశోధన లో శారీరక ఆరోగ్యం మనసు మీద, మానసిక కుంగుబాటు ఆరోగ్యం మీద ప్రభావం చూపిస్తుంది అనే విషయం కొంత మేరకు తెలిసినా ఇంత ప్రభావం ఉంటుంది అని మాత్రం హాస్పిటల్ లో ప్రాక్టికల్ గా తెల్సుకున్నాడు.

అదే సమయంలో తల్లి, తర్వాత తండ్రి ఆరు నెలల తేడా తో చనిపోయారు.

తనకి జరుగుతున్న అన్యాయం గురించిన మనో వేదన తోనే పోయుంటారు. తనకి డాక్టరేట్ వచ్చిందని అంతకు ముందొక రోజు వచ్చి చెప్పారు వాళ్ళు.

ఆ రోజు తండ్రి అన్నాడు.
"నువ్వు చేసిన థీసిస్ ఏమిటి? ఇప్పుడు నువ్వు ఉన్న పరిస్థితి ఏమిటి? ఎటువంటి కష్టాల్లో అయినా నీ మీద నువ్వు నమ్మకం కోల్పోకూడదు. అన్నీ బాగున్నప్పుడు అందరూ ఆత్మ విశ్వాసంతో ఉంటారు. ఏదైనా తేడా వచ్చినప్పుడే నువ్వేమిటో నిరూపించుకోవాలి. నీ చుట్టూ పెద్ద కుట్ర ఉందని తెలుసు. అందులో పాత్ర నీ అన్నదేననీ తెలుసు. ఏమీ చేయలేక, నిన్నిలా చూడలేక, ఎంత తల్లడిల్లిపోతున్నామో నీకు తెలీదు. ఎక్కడున్నా, ఎలాంటి పరిస్థితులోనైనా ధైర్యం గా ఉండరా! నువ్వు ఉన్న చోటే, నీ చుట్టూ ఉన్న వాళ్ళతోనే స్నేహం చేయి. వాళ్ళకి ఏదైనా అవసరం అయితే సహాయం చేయి. సంతోషంగా ఉండు!

వాడి మీద పగ తీర్చుకోవాలని అనుకుంటే వాడి లాగే నువ్వూ తయారయినట్లు! పగలు, ప్రతీకారాలు మంచి చెయ్యవు. మా కోసం నువ్వు నీ లాగే ఉండు."

అదే ఆఖరి సారి వాళ్ళని చూడటం.
***
ఒక్కసారి మనసంతా విషాదంగా అయిపోయింది. దిగులు కమ్ముకున్నట్లుగా, ఏదో బెంగ గా అనిపించింది.

బలవంతంగా ఆ పరిస్థితి నుంచి బయటికి వచ్చి పక్కకు చూసేసరికి తనకి దగ్గరగా జరిగి నోరు తెరుచుకుని తననే ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నాడు విష్ణు.

నవ్వొచ్చింది...కవల పిల్లలు, ఒకేలా కనపడే అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు కనపడితే చాలా మంది ఇలాగే ప్రపంచ వింత ని చూసినట్లు ప్రవర్తిస్తారు.

"భలే తమాషా గా ఉన్నాడే సుధీర్ పీఏ!" అన్నాడు కార్తీక్.

"మా సార్ కి మీరు తమ్ముడైతే మీరెందుకు ఇన్నాళ్లూ ఇంటికి రాలేదు?" అడిగాడు విష్ణు.

అతనికి అంతా గందరగోళం గా ఉంది.
"ఈ డబ్బున్న వాళ్ల లీల లే వేరు" అనుకున్నాడు.

ఏం చెప్పాలో తోచలేదు కార్తీక్ కీ, బృంద కీ.

గభాల్న మాట మార్చేశాడు కార్తీక్.
"చెప్పు బృందా! ఏం చేయాలనుకుంటున్నావు?"

మళ్లీ తనే అన్నాడు.
"అన్నయ్య పదవి వదులుకుని ఎక్కడికీ వెళ్లడు. వాడి సంగతి మనకు తెలుసు కదా. ఏదో కొన్నాళ్ళు తెలీకుండా మేనేజ్ చేయండి. వచ్చేస్తాడులే."

"నీ సహాయం కోసం వచ్చాను" అంది బృంద.

"నా సహాయమా?" వింతగా అనిపించింది అతనికి.

"నేనేం చేయగలను? ఏదో మారుమూల ప్రాంతంలో నా చిన్న ప్రపంచంలో గడుపుతున్నాను."

"కొన్నాళ్ళ పాటు నువ్వు..." ఒక్క క్షణం తటపటాయించి అడిగేసింది "సుధీర్ లా నటించగలవా?"

"ఏంటి?" నిటారుగా అయ్యాడు కార్తీక్.
ఆవేశం తన్నుకొచ్చింది అతనికి.

"ఏం అడుగుతున్నావు తెలుసా?
అది ఎంత పెద్ద క్రైమ్ అవుతుందో తెలుసా? తర్వాత నన్ను నీ భర్తే ఆ నేరం మోపి జైల్ లో తోయించుతాడు."

"బృందా, సుధీర్ మీద నాకే రోజు గొప్ప అభిప్రాయం లేదు, ఆశలు అంత కన్నా లేవు. కానీ నిన్ను మాత్రం గొప్పగా ఊహించుకుంటాను. నువ్వు కూడా ఇంత స్వార్థంగా అడుగుతావనుకోలేదు." అన్నాడు మళ్లీ.

"పదవులు లేకపోతే బ్రతకలేరా? మీ పదవులు, గొప్పలు నిలబెట్టుకోవటం కోసం మా లాంటి వాళ్ళ జీవితాలు నాశనం చేసుకోవాలా? " కోపం ఆగట్లేదు అతనికి.

"సారీ కార్తీక్, నాకేం చేయాలో తోచక నీ దగ్గరకు వచ్చాను. పదవి పోయిన మరుక్షణం అంతకు ముందు అతను చేసిన ప్రతి తప్పుడు పనికి అతణ్ణి దోషిగా నిలబెడతారు. మొత్తం మన కుటుంబాల పరువులు పోతాయని భయం తో వచ్చాను. తప్పుగా అర్థం చేసుకోకు." అంది బృంద.

"బృందా, నువ్వంటే వాడికి ఇష్టం కదా. నువ్వు చెప్పి ఉంటే వాడు వినేవాడు కాదా? తప్పులు చేయకుండా సరిదిద్దే భాద్యత నీకు లేదా?" అన్నాడు కార్తీక్.

నవ్వి లేచింది బృంద.

"వెళ్ళొస్తా కార్తీక్"

తల ఊపాడు అతను.

విష్ణు బృంద ని అనుసరిస్తూ ఇంకా వెనకకి తిరిగి తననే చూస్తున్నాడు. అతనికి తనే సుధీర్ అయ్యుంటాడని ఇంకా మనసులో అనుమానం ఉన్నట్లుగా ఉంది.

నవ్వుకున్నాడు కార్తీక్.
***
ఆ సాయంత్రానికి ముఖ్యమంత్రి కనపడట్లేదు అన్న వార్త సోషల్ మీడియా లో వైరల్ అవటం మొదలెట్టింది.

------*------

# Part - 3

చీఫ్ మినిస్టర్ కనపడట్లేదనే వార్త మెల్లగా ప్రచారం లోకి రావటం మొదలయింది. ఆఫీస్ కి, ఇంటికి ఫోన్ల మీద ఫోన్లు మొదలయ్యాయి.

విష్ణు, బృంద సర్ది చెప్పలేక సతమతం అవసాగారు.
విష్ణు కి ఫోన్ చేసింది బృంద.

"ఏం చేద్దాం?" అడిగింది.

"రేపు ప్రెస్ మీట్ పెట్టి సార్ ఏదన్నా మెడికల్ ఎమర్జెన్సీ లో ఉన్నారనీ, కొంత కాలం అందుబాటు లో ఉండరని చెప్తే?" అడిగాడు విష్ణు.

"ఆరోగ్యం గురించి అట్లా చెప్తే రోగిష్టి అని ముద్ర వేసి, పదే పదే ప్రచారం చేసే ప్రమాదం ఉంది. ఒత్తిడి వల్ల రెస్ట్ తీసుకుంటున్నారని నిజం చెప్పటం ఒక్కటే మార్గం అనిపిస్తోంది" అంది బృంద.

"మేడం, ఒత్తిడి, విశ్రాంతి లాంటి పదాలకి రాజకీయాల్లో స్థానం లేదు. ఇన్నాళ్లూ పులి, సింహం అన్న వాళ్లే పిచ్చి అని ముద్ర వేస్తారు. అదింకా ప్రమాదం" అన్నాడు విష్ణు

ఆలోచనలో పడింది బృంద.

సుధీర్ కేబినెట్ లో ఒక మంత్రి నుంచి అంతకు ముందే ఆమెకు ఫోన్ వచ్చింది.. రాజకీయాల్లోకి రాక ముందు ఆ మంత్రి పెద్ద రౌడీ గా పేరొందాడు. సెటిల్మెంట్ లు చేయటానికి, మాట వినని వాళ్ళని బెదిరించడానికి సుధీర్ కి అతని అవసరం ఉంటుంది. చేసిన తప్పులు వెంటాడుతుంటే బయటపడటానికి, వాటి నుంచి తప్పించుకోవటానికి అతనికి సుధీర్ అవసరం. పరస్పర అవసరాల మధ్య ఏర్పడ్డ ఆ బంధం చూడటానికి ఎంత గట్టిగా అనిపిస్తుందో, అంత బలహీనంగానూ ఉంటుంది.

అతని మాట చాలా రఫ్ గా ఉంది.
"అన్న ఎక్కడికి పోయాడు? ఎందుకు ఎక్కడా కనపడటం లేదు?" అడిగాడు.

"ఆరోగ్యం బాగాలేదు. కొన్నాళ్ళు విశ్రాంతి అవసరం" చెప్పింది బృంద.

"ఫోన్ ఇవ్వమ్మా" అన్నాడు.

"ఇంట్లో లేరు" చెప్పింది బృంద.

"సరే. తర్వాత చేయించమ్మా తప్పకుండా...మర్చిపోవద్దు చాలా అర్జంట్ పని ఉంది" అన్నాడు.

ఫోన్ పెట్టేశాను అనుకుని అతను ఆ తర్వాత మాట్లాడిన మాటలు ఫోన్ లోంచి వినపడ్డాయి బృంద కి.

"మళ్లీ ఏదో ఎదవ పని చేసుంటాడు. కనపడకుండా తిరుగుతున్నాడు. మనకి అవసరం అయినప్పుడు లేకుండా పోతే చూస్తూ కూర్చోవడానికి నేనేమన్నా పిచ్చోడినా?"

"దీనికీ వాడికీ అసలు పడనే పడదు. ఇట్లాంటప్పుడు వాడికి దీని బోడి సపోర్ట్" అంటున్నాడు.

అతను మాట్లాడింది తన గురించే.

తర్వాత ఫోన్ కట్ అయిపోయింది.

వింటున్న బృంద కి అవమానం తో రక్తం అంతా మొహం లోకి తన్నుకొచ్చింది.

కనపడినప్పుడు ఎంతో వినయం ప్రదర్శిస్తాడు. భుజాలు వంగి పోయి నిలబడతాడు. ఇటువంటి వాళ్ళను చూసుకుని సుధీర్ తనకి తిరుగు లేదనుకుంటాడు.

ఒకరితో ఒకరికి ఉన్న అవసరం వల్ల ఒక కూటమి గా ఏర్పడే ఇలాంటి వాళ్ల మధ్య సంబంధాలు ఇంత కంటే గొప్పగా ఎట్లా ఉంటాయి? సాధారణం గా ఇటువంటి సంబంధాల్లో ఉన్న రెండు పార్టీలను ఏకం చేసే శక్తి ఇద్దరికీ మధ్య ఉన్న శత్రువు వల్ల మాత్రమే సాధ్యం. శత్రువు బలహీన పడగానే వీళ్ల మధ్య సంబంధం కూడా పుటుక్కుమంటుంది.

***

సుధీర్ ఇంటి పైనున్న ఆఫీస్ లోనే ప్రెస్ మీట్ ఏర్పాటు చేశాడు విష్ణు.

టీవీ ఛానెల్స్ , యూట్యూబ్ లైవ్ టెలీ కాస్ట్ అని ఊదరగొడుతున్నాయి.

"ముఖ్యమంత్రి కనపడకపోవటం ఏమిటి?" అందరికీ ఆసక్తిగా ఉంది.

ప్రతిపక్ష నాయకుడు పార్థు పొద్దుటి నుంచి టీవీ కి అతుక్కు పోవటం చూసి అతని భార్య తల కొట్టుకుంది. ఇదే సందని తన వాగ్ధాటిని ప్రదర్శించసాగింది.

"చిన్నప్పుడు సినిమా కి వెళ్తే ముందు వరస లో కూర్చున్న వాళ్ళకి బొమ్మ ముందు కనపడుతుంది అనుకునే వాళ్ళం. అట్లా ఉంది మీ హడావుడి."

"మీకున్న ఇన్ఫర్మేషన్ ని బట్టి సీఎం మిస్సింగ్ అన్న మాట నిజం. ఇంక ఎదురు చూడాల్సిన అవసరం ఏముంది? ప్రభుత్వాన్ని కూల్చేసి, మీరే సీఎం అవ్వొచ్చుగా ఇక."

అంతలోనే మళ్లీ అంది మెల్లగా.

"ఇదిగోండి. మీరు సీఎం అయ్యాక మా చెల్లి ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిని చెయ్యాలి. ముందే చెప్తున్నా"

ప్రతిపక్ష నాయకుడిగా అతడు పులే కానీ భార్య ముందు మాత్రం పిల్లే.

"ఇళ్లలో వాళ్ల వల్లే మేము రాజకీయాల్లో మట్టి కొట్టుకుపోతున్నాం. మీతో గెలవలేక, ఇంట్లో ప్రశాంతత ఉండదని మీరు చెప్పే ప్రతిదీ చేసి తరవాత మేము జవాబు ఇచ్చుకోలేక చస్తున్నాం" అనుకున్నాడు.

"మీ చెల్లెలని నీకు ప్రేమ తప్ప ఆమెకి ఏం చాతనవుతుంది? పోనీ, ఆడవాళ్లకు, పిల్లలకు ఏమన్నా చేసిందా అంటే అదీ లేదు. తన ఇంట్లో పని చేసే వాళ్ళను నానా తిట్లూ తిట్టటం, పిల్లల్ని వదిలేసి బలాదూర్ క్లబ్ లకి తిరగటం, అంతేగా. ఏ శాఖ ఇవ్వాలో కూడా మీ అక్కాచెల్లెళ్ళు నిర్ణయిస్తారా?" అన్నాడు పార్థు. బీపీ పెరిగింది అతనికి.

మూతి తిప్పింది అతని భార్య. ఇక తన వైపు ఏడు తరాల చరిత్ర బయటకి తీస్తుంది కాబోలు. గభాల్న వేరే వైపు కి తిప్పాడు సంభాషణ.

"ఈ సీఎం భార్య పైకి కనపడదు కానీ చాలా తెలివైనది అని విన్నా. ఏదైనా కవర్ చేస్తుందేమో అని అనుమానం గా ఉంది. అతనికి రాజకీయ వ్యూహకర్త ఆమే అని చెప్పుకుంటారు అంతా" మెచ్చుకోలుగా అన్నాడు.

"మీకు నేను, మా పుట్టింటి వాళ్ళు తప్ప అందరూ తెలివైన వాళ్ళుగానే కనపడతారు" మూతి తిప్పుకుంటూ, గొణుక్కుంటూ లోపలికి వెళ్లిపోయింది ఆమె.

***

జర్నలిస్టులు హడావిడి పెడుతున్నారు.

లోపల విష్ణు వాళ్ళతో బృంద ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో సిద్ధం చేస్తున్నాడు.

బృంద ప్రెస్ ముందుకి రావటానికి ఉపక్రమిస్తోంది.

అప్పుడు జరిగింది ఒక సంఘటన.

జర్నలిస్టులు అందరూ సుధీర్ ఆఫీస్ గది వైపు చూస్తున్నారు.

జర్నలిస్టులు ఉన్న గది ఎంట్రన్స్ తలుపు దగ్గర అలికిడి. ఎవరూ పట్టించుకోవట్లేదు.

తన గది నుంచి అప్పుడే బయటికి వచ్చిన బృంద ఆశ్చర్యాన్ని అదుపు లో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తూ అటు వైపు చూస్తుండటం తో అందరి దృష్టి అటు వైపుకి మరలింది.

ఆశ్చర్యంతో విష్ణు నోరు తెరుచుకుంది.

ఎదురుగా సీఎం.

అంతా అతణ్ణి చుట్టుముట్టారు.

"సర్, మీరు ఒక వారం రోజులు గా కనపడక పోవటానికి, మీరు కనపడకుండా పోయారన్న వార్తలకి మీ సమాధానం ఏమిటి?"

"ఈ వారం రోజులు గా మీరెక్కడ ఉన్నారు?" ప్రశ్నలు గుప్పిస్తున్నారు జర్నలిస్టులు.

అతను భుజాలు ఎగరేసి వాళ్లను వారిస్తూ అన్నాడు

"ఒకరి తర్వాత ఒకరు అడగండి..."

వాళ్ళు మాట్లాడే లోపు మళ్లీ తనే అన్నాడు.

"మీరు అడగబోయే ముందుగా మీకు ఒక విషయం తేల్చి చెప్పాలి. నేను ఎక్కడికీ వెళ్లిపోలేదు. మీరందరూ అనుకున్నట్లుగా, ప్రచారం చేసినట్లుగా మిస్సింగ్ కూడా కాదు."

"మన రాష్ట్రానికి పెట్టుబడిదారులను తీసుకురావటానికి న్యూజెర్సీ లో జరుగుతున్న ఒక సమావేశానికి వెళ్ళాను. ఫ్లైట్ దిగుతూనే ఇక్కడ జరుగుతున్న హడావిడి కి ఆశ్చర్యపోయాను".

"ఏం సమావేశం? మీ మీటింగ్ తర్వాత ఎంత మంది ఇన్వెస్టర్స్ మన రాష్ట్రం లో పెట్టుబడులు పెట్టబోతున్నారు? ఎన్ని కంపెనీలు రాబోతున్నాయి?" అడిగాడు వాల్మీకి.

అతని వైపు చూసి నవ్వేశాడు సీఎం.

"Confidentiality అన్న పదం ఒకటి ఉంది తెలుసా? ప్రతి విషయం మీకు చెప్పాల్సిన అవసరం లేదు. దాని వల్ల మన రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు పక్క రాష్ట్రానికి వెళ్లే అవాశాలున్నాయి".

"మీలో ఏదో తేడా కనిపిస్తోంది సర్" పళ్ళన్నీ తెరిచి నవ్వి అడిగింది మరో జర్నలిస్ట్.

"మీకీ మధ్య అనుమానాలు ఎక్కువయ్యాయి. అఫ్ కోర్స్, మా రాజకీయ నాయకులు చేసే పనులు కూడా అట్లాగే ఉంటున్నాయనుకోండి. అయితే ఇక్కడ మీరు ఊహిస్తున్నంత ఏమీ జరగటం లేదు. అంతా నార్మల్. మీ పనులు మీరు చేసుకోవచ్చు" కొంచెం వ్యంగ్యం ధ్వనించింది అతని స్వరం లో.

అక్కడితో సమావేశం ముగిస్తున్నట్లు ప్రకటించాడు విష్ణు.

మరెవ్వరికీ మాట్లాడే ఆస్కారం ఇవ్వకుండా అందరికీ చేతులు జోడించి అభివాదం చేస్తూ లోపలకి వెళ్ళిపోయాడు సీఎం.

***

సీఎం ఇంట్లో...

కింద హాల్ లో ఎదురెదురుగా సోఫాల్లో కూర్చున్నారు బృంద, కార్తీక్.

విష్ణు కొద్ది దూరం లో చేతిలో ఐపాడ్ తో అతి వినయంగా నిలబడి ఉన్నాడు. చెవులు రిక్కించి వాళ్ళు మాట్లాడేది వినటానికి ప్రయత్నిస్తున్నాడు.

మనుషుల్లో సాధారణంగా కనపడే జబ్బు ఇది. వేరే వాళ్ళకి సంబంధించిన విషయాల్లో అవసరానికి మించిన కుతూహలం ఉంటుంది. ఆ విషయం వల్ల మనకి ఎటువంటి ఉపయోగం లేకపోయినా సరే. అందుకే ఈ నెల ఫోన్ బిల్ కట్టటం మర్చిపోవచ్చేమో కానీ పక్కింటి పిన్ని వచ్చే నెల ఏ రోజు ఊరెళ్తుందో మాత్రం బాగా గుర్తుంటుంది.

అందులోనూ అతను పీఏ. సీఎం కుటుంబ విషయాల్లో అతనికి ఆసక్తి ఉండటం లో ఆశ్చర్యం కూడా ఏమీ లేదు.

"రానన్నావ్?" కార్తీక్ తో అంది బృంద.

"ఎప్పుడూ నువ్వు ఎవర్నీ ఏమీ అడగవు కదా. అందులో నన్ను అసలు అడగలేదు. పైగా నాకిప్పుడు నా అన్న వాళ్ళు ఎవరున్నారు? సుధీర్ అంటావా...వాడు నాకు అన్నో, శత్రువో అర్థం కాకుండా ఉంటోంది వాడి ప్రవర్తన. మీకు పుట్టిన వాడిని నేనింత వరకూ నా కళ్ల తో చూడలేదు. కాబట్టి అక్కడ ఆ సెంటిమెంట్ కూడా లేదు"

కొనసాగిస్తూ అన్నాడు."అందుకే నువ్వు అడిగాక కాదనాలనిపించలేదు."

"నువ్వు అనుమానించినట్లే ఈ వంక చూపించి సుధీర్ తర్వాత నీ మీద క్రిమినల్ కేసు పెట్టిస్తే?" అడిగింది బృంద.

"ఇప్పుడు నేనున్న పరిస్థితి కి జైల్ అయినా, బయట అయినా పెద్ద తేడా ఏమీ ఉండదు. నన్ను చిన్న గదిలో బంధించినా, నా ఊహలు రెక్కలు చాచుకుని విశాలమైన ప్రపంచం లో విహరిస్తుంటాయి" అన్నాడు కార్తీక్.

బృంద కి బాధ గా అనిపించింది.
"ఎందుకు ఇటువంటి మంచి వాడిని, తన భర్త అన్ని కష్టాలు పెట్టినట్లు?" అనుకుంది.

"ఇప్పుడు నా కండిషన్...ఒక్క నెల మాత్రమే నేనిక్కడ ఉంటాను. అంత కంటే ఒక్క రోజు కూడా ఎక్కువ ఉండే సమస్య లేదు. ఈ లోగా సుధీర్ తిరిగొస్తే అతనొచ్చిన వెంటనే వెళ్ళిపోతాను. ఈ లోగా అతన్ని మీరు తెచ్చుకుంటే మీకే మంచిది." ఖచ్చితంగా చెప్పాడు కార్తీక్.

"నువ్వు వచ్చినందుకు థాంక్యూ కార్తీక్.  నెల చాలు. అంత కంటే ఎక్కువ నిన్ను ఇబ్బంది పెట్టను." అంది బృంద

"విష్ణూ, నువ్వు వినకూడనంత రహస్యాలు మాట్లాడటం లేదు మేము. ఇంకాస్త ముందుకు వంగావంటే విరిగి కింద పడతావ్ జాగ్రత్త!." పక్కకి తిరిగి విష్ణు వైపు చూసి నవ్వుతూ అన్నాడు కార్తీక్.

"హి హి" బలవంతంగా నవ్వాడు విష్ణు.

ఇతని కంటే సుధీర్ బెటరేమో అనిపించింది విష్ణుకి.

సుధీర్ కోపం వస్తే అరుస్తాడు. అతని అరుపుల వల్ల చుట్టూ ఉన్న వాళ్ళకి తన మీద సానుభూతి అన్నా కలుగుతుంది. ఇతను తనని ఎక్స్ పోజ్ చేసి అల్లరి చేసేట్లున్నాడు.

***

తమ ఇంట్లో ఒక గదిని కార్తీక్ ఉండటానికి ఏర్పాటు చేసింది బృంద.

మర్నాడు పొద్దున బ్రేక్ ఫాస్ట్ చేస్తున్నప్పుడు కార్తీక్ తో అంది బృంద.

"ఈ అవకాశాన్ని వాడుకుందామా?"

కనుబొమ్మలు ముడి వేసి అర్థం కానట్లు బృంద కేసి చూశాడు కార్తీక్.

"ప్రజలకి ఏదో చెయ్యాలనే ఆలోచన తో మా తాతగారు రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితుల్లో ఎంతో మార్పు ఉందనుకో. అయినా మన వైపు నుంచి ప్రస్తుతం నీకున్న పదవి ద్వారా ఏదైనా చేస్తే బాగుండునేమో అనిపిస్తోంది నాకు." అన్నది.

కొంచెం ఆగి మళ్లీ అన్నది.

"మొదట్లో సుధీర్ కూడా అలాగే ఆలోచించేవాడు. లేదా కనీసం అలా అలోచిస్తున్నట్లుగా నన్ను నమ్మించన్నా ఉంటాడు. ఏది ఏమైనా రాజకీయాల్లో ఉన్న వాళ్ళు పరిస్థితులు, చుట్టూ ఉన్న వాళ్ళ వల్ల త్వరగా పొల్యుట్ అయిపోతారనుకుంట."

"కనీసం ఇప్పటికి అయినా సుధీర్ చేసిన తప్పులు సరిదిద్దే అవకాశం మనకొచ్చింది. ఈ ఛాన్స్ ని మనం వదులుకోకూడదు." అంది ఆఖరుగా.

నవ్వాడు కార్తీక్.

"నువ్వు కూడా అందరు ఆడవాళ్ళ లాగే మీ ఆయన తప్పుల్ని వేరే వాళ్ళ ఖాతా లో వేస్తున్నావన్న మాట. అయినా నేనుండేది నెల మాత్రమే అని గుర్తు పెట్టుకో. పైగా నేను తనలా నటిస్తున్నానని అర్థం అవగానే సుధీర్ వెనక్కి రావొచ్చు. అది ఒక్క వారంలో అవ్వొచ్చు. లేదా ఒక రోజులో  కావొచ్చు."

మళ్ళీ తనే అన్నాడు.

"ఈ లోగా మనకి చేతనైనంత చేద్దాం. ఎక్కడ మొదలెడదాం?"

బృంద మొహం వెలిగిపోయింది.

***

సుధీర్ మీద వస్తున్న ఆరోపణలకు సంబంధించిన ఫైల్స్ అన్నీ విష్ణు ద్వారా తెప్పించుకున్నాడు కార్తీక్.

ఒక్కొక్కటి చదువుతుంటే అతనికి కళ్ళు బైర్లు కమ్మాయి. ఒకటా, రెండా? ఇన్ని అరాచకాలా? ఒక మనిషి రాజకీయాల్లో ఉండాలంటే ఇంత దిగజారాలా?

అందులో సుధీర్ పే కాకుండా, అతని పార్టీ నుంచి గెలిచిన అనేకమందికి సంబంధించిన వివరాలు ఉన్నాయి.

ప్రభుత్వానికి చెందిన ప్రతి స్కీం లో స్కాం. అంతా ఒక కూటమి గా ఏర్పడి సంక్షేమ పథకాలు ఏవీ ప్రజల వరకూ పూర్తిగా వెళ్లకుండా మధ్యలో సగం స్వాహా చేస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టటానికి వచ్చిన ప్రతి కంపెనీ నుంచి వాళ్ళు చేసిన వసూళ్లు, కాంట్రాక్టర్ ల నుంచి ముట్టజెప్పబడ్డ సొమ్ము వివరాలున్నాయి.

ఇవి ఒక ఎత్తయితే వాళ్ల ఘనకార్యాలు మరో ఎత్తు. వాళ్ళు చంపించిన వాళ్ల వివరాలు, చావడానికి ప్రేరేపించేలా సంఘటనలు సృష్టించటం సవివరంగా రాసి ఉన్నాయి. ఇక ఆడవాళ్ళ మీద, తమ కంటే తక్కువ స్థాయి లో ఉన్న వాళ్ల మీద వాళ్ళు చేసిన అరాచకాలకు సంబంధించిన చిట్టా కట్టలు కట్టలు గా ఉంది.

"ఇవేమన్నా సర్టిఫికేట్లు అనుకుంటున్నారా? ఫైల్ చేసి పెట్టుకున్నారు. ఈ పనులు చేసినందుకు సిగ్గుతో తల దించుకోవాలి. ఈ ఫైల్ ఎవరికన్నా దొరికితే ఏమవుతుందో తెలుసా?" విష్ణు ని అడిగాడు కార్తీక్.

"మనం చేసిన ఫైల్ కాదండీ. వాల్మీకి అని ఒక జర్నలిస్ట్ ఉన్నాడు. వాడు తయారు చేసి పెట్టుకున్న ఫైల్ ఇది. కొట్టుకొచ్చేశాం." ఆనందంతో కళ్ళు మెరుస్తుండగా చెప్పాడు విష్ణు.

"సిగ్గు లేదా ఆ మాట చెప్పటానికి? మీకు పవర్ ఉన్నది ఇటువంటి దొంగ పనులు చేయటానికా?" కోపం ఆగట్లేదు కార్తీక్ కి.

"అంతా తొండి. మేము చేసి పెట్టుకున్నామని మొదట తిట్టాడు. ఇప్పుడు వేరే వాళ్ళు చేసిందన్నా తిడుతున్నాడు. ఇతని కంటే ఇతని అన్నే నయం" మనసులో అనుకున్నాడు విష్ణు.

పైకి మాత్రం వినయంగా తల దించుకుని నిలబడ్డాడు కాసేపు. తర్వాత చెప్పటం మొదలెట్టాడు.

"రాజకీయాల్లో ఇవన్నీ తప్పవు సార్. వాల్మీకి అనవసరంగా ఇంత కష్టపడ్డాడు కానీ ప్రజలకి కూడా చూచాయగా అన్నీ తెలిసే ఉంటాయి. అయినా మాకేమీ కాలేదు కదా, మా వరకూ రాదులే అన్న అభిప్రాయం తో ఓట్లు వేస్తుంటారు."

కుతూహలంగా వింటున్నాడు కార్తీక్.

"అంతా సజావుగా జరుగుతున్నదనుకుంటుండగా సడెన్ గా ఏదో విషయం వల్ల జనాల్లో ఎక్కడో ఏవగింపు మొదలవుతుంది. అప్పటి నుంచీ ఆ పార్టీకి పతనం ప్రారంభమవుతుంది. ప్రజలు మీరు అనుకుంటున్నంత అమాయకులు కాదు సార్. వాళ్ళు రాజకీయ నాయకులతో తోలుబొమ్మలాట ఆడతారు"

"ఎటువంటి విషయాల వల్ల వ్యతిరేకత మొదలవుతుందంటావ్?" అడిగాడు కార్తీక్.

"ఇప్పటి వరకూ అంటే నేను గమనించిన వరకూ ఏదో ఒక చిన్న విషయంలోనే ప్రతికూలత మొదలవడం చూసాను. నేననుకోవటం ఎక్కడో ఎవరికో ఏదో విషయంలో కడుపు మండుతుంది. వాడు జనాల్ని తనకి తెలీకుండానే ప్రభావితం చేయటం మొదలెడతాడు. కొత్త లీడర్ గా ఎదుగుతాడు."

కొంచెం సేపు ఆగి సిగ్గు పడుతూ అన్నాడు విష్ణు.
"అయినా నాకేం తెలుస్తుంది సార్. నేనేమన్నా ప్రశాంత్ కిషోర్ నా?"

ప్రజల్లో వ్యతిరేకత బాగా ఉండి, తను త్వరగా పరిష్కరించగలిగిన అంశం పైన దృష్టి పెట్టదల్చుకున్నాడు కార్తీక్. తాము దాని మీద దృష్టి పెట్టామని, పని చేస్తున్నామన్న విషయం కూడా ప్రజలకి త్వరగా చేరేలా చర్యలు తీసుకోవాలి అని కూడా అనుకున్నాడు.

తీరికగా కూర్చుని మరింత లోతుగా ఆ స్కామ్ ల మీద అధ్యయనం చేయటం మొదలెట్టాడు కార్తీక్.

***

తన షెల్ఫ్ అంతా వెతుకుతున్నాడు వాల్మీకి. అది మూడో సారి అతను వెతకటం.

"ఎక్కడ పెట్టాను?" కాసేపు ఆలోచించాడు.

ఒకవేళ ఎవరైనా కొట్టేసారా?

"అమ్మా" పిలిచాడు.

"ముఖ్యమైన కొన్ని డాక్యుమెంట్స్ ఇక్కడ పెట్టాను. ఇప్పుడు కనపడట్లేదు. ఎవరైనా తీశారా?" అడిగాడు.

"ఎవరు తీస్తార్రా? ఇంట్లో ఉండేది మనిద్దరమే. నేను ఇంట్లోనే ఉన్నాగా. ఎవరూ రాలేదు."

"ఏం డాక్యుమెంట్స్?"ఆసక్తి గా అడిగింది.

"మన అధికార పార్టీ వాళ్లు ఈ మూడేళ్లలో చేసిన స్కాం ల గురించినవిలే!" వెదకడం ఆపకుండానే అన్నాడు.

"చక్కగా ఐఐఎం లో చదివావు. నీతో పాటు చదివిన వాళ్లంతా మంచి పే ప్యాకేజ్ లతో పెద్ద పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. ఎందుకొచ్చిన జర్నలిజం రా నీకు? ఈ పరిశోధనల వల్ల నీకు వచ్చేదేముంది? వాళ్ళ అవినీతి బయట పెడితే ఊరుకుంటారా? అసలే పవర్ లో ఉన్నారు. నిన్నేమైనా చేస్తార్రా!" భయంగా అందామె.

"అందరూ అలా అనుకుంటే ప్రజలు ఏమైపోతారమ్మా? మన తర్వాత తరాల కోసమైనా ప్రశ్నించే వాళ్ళు, నిలదీసే వాళ్ళు ఉండాలి. లేకపోతే దేశం సర్వనాశనం అయిపోతుంది." అన్నాడు.

"ఎవరికీ లేనిది మధ్యలో నీకెందుకురా?" ఖండిస్తూ అందామె.

"ఎందుకేమిటమ్మా, నాకు సామాజిక బాధ్యత, సమాజం పైన ప్రేమ, అక్కర ఉంది.  నాకు కుటుంబ భాధ్యతలు లేవు. రేపు నాకేమైనా అయితే నిన్ను చూసుకోవటానికి అక్క ఉంది కదా." చెప్తున్నాడు వాల్మీకి.

"నీ మాటలు నాకు అర్థం కావు కానీ షెల్ఫ్ అంతా చిందరవందర చేయకు. మొన్నే పనమ్మాయితో అంతా సర్దించా!"

"పనమ్మాయి ఏంటి. ఆమె కి వనజ అన్న పేరు ఉంది కదా. పేరుతో చెప్పు." అంటుండగా తల కొట్టుకుంటూ వెళ్లిపోయింది అతని తల్లి అక్కడ నుంచి.

"వీడిదో చాదస్తం!".తనలో తను అనుకుంది.

సడెన్గా బల్బ్ వెలిగింది అతనిలో.

వనజని బెదిరించో, ఆశ చూపో ఎవరో కొట్టేయించి ఉంటారు. అంటే తానెంత జాగ్రత్త గా ఉన్నా తన దగ్గర ఇన్ఫర్మేషన్ ఉన్న సంగతి బయట తెలిసిందన్న మాట.

నవ్వుకున్నాడు అతను.

లోపల బట్టల మధ్య పెన్ డ్రైవ్ ఉందని తెలిసి ఉండదు. ఒక్క చోటే పెడతాడనుకున్నారేమో.  కుట్రలు, కుతంత్రాలు చేసే వాళ్లంతా కూడా బోల్తా పడేది వేరే వాళ్ళని తక్కువ అంచనా వేయటం వల్లనే!

అయితే తనే వాళ్ళని తక్కువ అంచనా వేశానని కాసేపట్లోనే అతనికి అర్థమయింది.  వాళ్ళు పెన్ డ్రైవ్ నీ వదలలేదు.  అందులో ఉన్న డేటా మొత్తం చెరిపేసి రీఫామాట్ చేసి దానికి యధాస్థానంలో ఉంచేసి వెళ్లి పోయారు.

ఉసూరుమన్నాడు వాల్మీకి.

***

మర్నాడు కార్తీక్ కి సుధాకర్ & కో తో మీటింగ్ ఏర్పాటు చేశాడు విష్ణు.

రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు నిర్మాణ కాంట్రాక్టులు అన్నీ గవర్నమెంట్ వాళ్ళకే ఇచ్చింది.

తన కేబిన్ లో కూర్చున్నాడు కార్తీక్.

సుధాకర్, అతని పార్టనర్స్ ముగ్గురూ సీఎం పిలుపు కోసం నిరీక్షిస్తున్నారు. సాధారణంగా అయితే సీఎం బిజీ గా ఉన్నారని చెప్పి వాళ్ళను ఒక గంటన్నా వెయిట్ చేయించే వాడు విష్ణు. మారిన పరిస్థితుల్లో టైమ్ కి పంపకపోతే కార్తీక్ తిడతాడేమో అని అనుమానంగా ఉంది అతనికి.

బుర్ర గోక్కుంటూ ఆలోచించాడు విష్ణు. ఎందుకైనా మంచిదని ఇచ్చిన సమయానికి ఒక అయిదు నిమిషాల తర్వాత వాళ్ళను లోపలికి తీసుకెళ్ళాడు.

"నమస్తే అన్నా!" సీఎం ని చూడగానే నోరారా నవ్వుతూ అన్నాడు సుధాకర్.

"సర్, సుధాకర్ అంటే ఈయనే. వీళ్ళు అతని కంపెనీ లో పార్టనర్లు." పరిచయం చేసి వినయంగా సీఎం పక్కన నిలబడ్డాడు విష్ణు.

పలకరింపుగా నవ్వబోయి ఆపుకుని "కూర్చోండి" అన్నాడు కార్తీక్. నవ్వితే తను సుధీర్ కాదని అర్థమవుతుందని అతనికి తెలుసు. ఇద్దరి మధ్యా చిరునవ్వు లో కొంత తేడా ఉంటుంది.

కార్తీక్ వి ప్రశాంతమైన ముఖకవళికలు అయితే సుధీర్ ది గంభీరమైన మొహం.

పరిశీలనగా చూసాడు సుధాకర్ వైపు. ఆరడుగుల ఎత్తు, నల్లటి రంగు, బుంగ మీసాలు, నుదుట పెద్ద బొట్టు, పళ్ళు నల్లగా కనపడుతున్నాయి. గుట్కా తింటాడేమో. అక్కడక్కడా కొన్ని పళ్ళు ఊడిపోయి కనపడుతున్నాయి.

ఇటువంటి వాళ్ళకి మరీ భక్తి ఎక్కువ.

"తప్పుడు పనులు చేసి దేవుడి ముందుకి ఏ ధైర్యం తో వెళ్తారో" తరచుగా అనుకుంటాడు కార్తీక్.

"అన్నా, రమ్మన్నారంట. కొత్త కాంట్రాక్టులు ఏమైనా ఉన్నాయా?" అడిగాడు సుధాకర్.

గొంతు సవరించుకుని అన్నాడు కార్తీక్.
"ఇదివరకు ఇచ్చిన కాంట్రాక్ట్ ల గురించి మాట్లాడటానికి పిలిచాను."

"అన్నీ అయిపోయాయి కదా" నమ్మకంగా చెప్పాడు సుధాకర్.

నవ్వొచ్చింది కార్తీక్ కి. ఏముంది అక్కడ అయిపోవడానికి. రోడ్లు వేసే ఆలోచనే లేనప్పుడు. కొన్ని చోట రోడ్డు కడిగి, కొన్ని చోట్ల దోశ వేసినట్లుగా పల్చటి రోడ్లు వేసి అయిందనిపించారు.

"మీరు వేసిన రోడ్లు నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవటం వల్ల మేము మాట పడాల్సి వస్తోంది. రాష్ట్రం మొత్తంగా నిరసలు ఎదుర్కొంటున్నామంటే ప్రధాన కారణం రోడ్లే." అతనేమంటాడా అని చూస్తూ క్షణం ఆగాడు.

"మీకు తెలియంది ఏముంది అన్నా." చేతులు నులుముకుంటూ అన్నాడు.

"అసలేం మెటీరియల్ వాడుతున్నావయ్యా? ఆసిడ్ ఏమైనా పోయిస్తున్నావా? అంతకు ముందు వేసిన రోడ్ల మీద మీరు రిపేర్లు చేస్తే అదివరకున్న రోడ్డు కూడా లేచిపోతున్నదంట." చిరాకుగా అన్నాడు కార్తీక్.

అదోలా చూసాడు సుధాకర్. ముసి ముసి నవ్వులు నవ్వుతూ అతని పార్టనర్స్ లో ఒకడు గొప్పగా చెప్పాడు.
"అన్న మెటీరియల్ అంతా చైనా నుంచి తెప్పిస్తాడు సార్. లోకల్ మెటీరియల్లో క్వాలిటీ ఉండదు."

"నేను మిమ్మల్ని పొగడట్లేదు" సీరియస్ గా అన్నాడు కార్తీక్.

"మిమ్మల్ని నమ్మి మీకు కాంట్రాక్టులు ఇస్తే ఇదా మీరు చేసే పని. మీ వల్ల రాష్ట్రం మొత్తంగా నా మీద వ్యతిరేకత ఏర్పడింది. రాబోయే ఎలక్షన్ లో మా పార్టీ ఓడిపోతే ఎవరు బాధ్యులు?" కోపంగా గొంతు పెంచుతూ అన్నాడు.

"నిన్ను ఓడిపోనిస్తామా అన్నా?" రోషంగా అన్నాడు సుధాకర్.

"ఎట్లా గెలిపిస్తావ్?" రెట్టించాడు కార్తీక్.

"డబ్బులు పంచుతామన్నా. రిగ్గింగ్ చేయిస్తాం. మనకు ఓట్ వెయ్యరనుకున్న వాళ్ళను పోలింగ్ బూత్ కి రాకుండా చేస్తాం. ఇట్లా చాలా పద్దతులు ఉన్నాయి కదా అన్నా."

పక్క వాళ్ళతో అన్నాడు.
"ఇవన్నీ అన్నకి తెలీవా? కావాలని మనల్ని పరీక్షిస్తున్నాడు."

అతని పార్టనర్స్ ఇద్దరూ చిలిపిగా నవ్వారు.

ఒళ్ళు మండింది కార్తీక్ కి.

"పరీక్ష కాదు. సీరియస్ గానే చెప్తున్నా. మీకిచ్చిన కాంట్రాక్టులు అన్నీ చదివా. అందులో పెనాల్టీ క్లాజ్ ఉంది. దాని ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే, దాని వల్ల ఎవరైనా సాధారణ పౌరులకు ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే, కాంట్రాక్ట్ ప్రస్తుత విలువలో మీరు యాభయ్ శాతం పెనాల్టీ గా కట్టాలి. రుజువులు సృష్టించటానికి  నాకు పెద్ద  టైమ్ పట్టదని నీకు తెలిసే ఉండాలి" గట్టిగా అన్నాడు.

"ఇదేం అన్యాయం అన్నా?" నమ్మలేనట్లుగా మొహం పెట్టి అన్నాడు సుధాకర్.

"అన్యాయం కాదు. ఇదే న్యాయం. నువ్వు కట్టాల్సిన పెనాల్టీ ఎంతంటే..." ఒక తెల్ల కాగితం తీసుకుని రాసి చూపించాడు కార్తీక్.

ఆ సంఖ్య చూసి సుధాకర్ తెల్ల మొహం వేశాడు. అతని పార్టనర్స్ లో ఒకతను గుండె పట్టుకున్నాడు.

ఆఖరి ప్రయత్నంగా అడిగాడు సుధాకర్.

"నిజంగానే అంటున్నావా అన్నా?"

"నీతో నాకు జోకులేంటి? నిజమే. మరో వారం లో మీకు నోటీస్ లు అందుతాయి. రెడీ గా ఉండండి." ఖచ్చితంగా అన్నాడు కార్తీక్.

కోపంతో ఊగిపోతూ లేచాడు సుధాకర్.

"నేనొక్కడినే మింగానా ఆ నిధులన్నీ?నీకు సగం పైన ఇచ్చాను. కావాలంటే నీ పర్సెంటేజ్ కింద ఇచ్చిన డబ్బులు కట్టుకో పెనాల్టీ"

"నువ్వు నాకు వాటా ఇచ్చినట్లు ఏంటి ఆధారం?" రెట్టిస్తూ అన్నాడు కార్తీక్.

కోపంగా ఉన్నప్పుడే నిజాలు బయటకు వస్తాయన్న సంగతి అతనికి తెలుసు.

"మదాలస పేరు మీదున్న నీ బినామీ ఆస్తుల విషయం, బిట్ కాయిన్స్ రూపాన నువ్వు డిజిటల్ గా దాచిన డబ్బు అంతా బయటకి లాగుతా!" అరవసాగాడు అతను.

విష్ణు వింతగా గమనిస్తున్నాడు. అతనికి ఆశ్చర్యంగా ఉంది ఇదంతా...

సుధాకర్ అరుపులకి సెక్యూరిటీ వాళ్ళు లోనికి తోసుకొచ్చారు. అతన్ని, అతడి తో పాటు వచ్చిన వాళ్ళను భుజాలు పట్టి తోసుకుంటూ బయటికి తీసుకెళ్లారు.

విష్ణు తేరుకుని చూసేసరికి కార్తీక్ ప్రశాంతంగా ఫైల్ తిరగేస్తున్నాడు.

"సార్, మీకేం భయం వెయ్యటం లేదా?" అడిగాడు విష్ణు అతణ్ని.

"భయం ఎందుకు? మనం చేసేది సరైనది అయినప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని మా అమ్మ చెప్పేది చిన్నప్పుడు" అన్నాడు కార్తీక్.

"సార్, మరి...మరి...ఇవన్నీ మీ అమ్మగారు సుధీర్ సార్ కి చెప్పలేదా?" నసుగుతూ అన్నాడు విష్ణు.

కార్తీక్ మొహం చూసి మళ్ళీ తనే అన్నాడు.

"ఆ టైమ్ కి సుధీర్ సార్ ఇంట్లో ఉండి ఉండకపోవచ్చు".

గట్టిగా నవ్వేశాడు కార్తీక్.

"నువ్వు భలే వాడివోయ్. చాలా ఇంటరెస్టింగ్ కారక్టర్ వి"

"హమ్మయ్య, తిట్టలేదు" మనసులో సంతోషించాడు విష్ణు.

ఇంతలో కార్తీక్ అడిగాడు.
"సుధాకర్ తనతో ఈ రకం గా మాట్లాడుతాడని అన్నయ్య ఊహించి ఉంటాడా?"

"అస్సలు అనుకుని ఉండరు సార్. అయినా ఆయన అన్నది కూడా నిజమే. మన వాటాలన్నీ మనకి ముట్టేయి. అన్నీ సీఎం గారికి కూడా తెలిసే జరిగాయి. అందుకే అతను ఈ ట్విస్ట్ కి షాక్ అయ్యాడు. కానీ వాడు పరమ dangerous అంటారు. వాడి వెనక మాఫియా ఉంది సార్" భయంగా అన్నాడు విష్ణు.

"వాడి మొహం" కొట్టి పారేశాడు కార్తీక్.

"మదాలస ఎవరు? బినామీ అంటాడేమిటి?" అడిగాడు కార్తీక్.

ఏడుపొచ్చింది విష్ణుకి.

"ఈ దరిద్రం కూడా ఇప్పుడు తన ద్వారా తెలియాలా?"

"మాట్లాడవేమిటి?"  రెట్టించాడు కార్తీక్.

"అంటే సార్, ఆవిడ మన సార్ కి... గాళ్ ఫ్రెండ్" గుసగుస గా అన్నాడు.

"అర్థం కాలేదు. ఈ రూం లో ఎవరున్నారు? గట్టిగా మాట్లాడు" విసుక్కున్నాడు కార్తీక్.

మళ్లీ చెప్పాడు విష్ణు.

"ఏమిటీ?"

అతనికి అంతా చేదు తిన్నట్లుగా అయింది. తననుకున్నట్లు బృంద సంతోషంగా ఏమీ లేదు.

తన అన్న నమ్మిన వాళ్లందరినీ మోసం చేశాడు....బృంద తో సహా అందరినీ."

"బృంద కి తెలుసా?" అడిగాడు కార్తీక్.

"ఆవిడకి ఎప్పుడో తెలుసు సార్. మీకు తెలుసో లేదో వాళ్లిద్దరి మధ్య మాటలు లేవు! ఏదో సార్ కనపడకుండా పోవటం అనే సంఘటన జరిగినప్పటి నుంచి కాస్త మెసేజ్ లు మొదలయ్యాయి" చెప్పాడు విష్ణు.

ఈ విషయం తనకి తెలీకుండా ఉంటే బాగుండేదని అనిపించింది కార్తీక్ కి.

***

సుధాకర్ అండ్ కో తో ఉన్న కాంట్రాక్టులు అన్నీ రద్దు చేయటం, జరిగిన పని లో నాణ్యత పాటించనందుకు పెనాల్టీ వేయటం
గురించి మీటింగ్ అయిన వెంటనే విష్ణు ప్రెస్ కి లీక్ లు అందించాడు

***

ఆ సాయంత్రం సుధీర్ బృంద కి ఫోన్ చేసాడు.

గట్టిగా అరవడం మొదలెట్టాడు.

"నువ్వేం చేస్తున్నావో నీకు అర్థమవుతోందా? కార్తీక్ గాడిని ఎక్కడ నుంచి తీసుకొచ్చావు?"

"నీతో మాట్లాడటం తప్పనిసరి అవటం వల్ల మాత్రమే మాట్లాడుతున్నాను. నా మీద వదిలేసావు. నాకు తోచిన పరిష్కారం నేను ఇచ్చాను. నచ్చక పోతే నువ్వే వచ్చి రిజైన్ చేసేయి." అనేసింది బృంద.

"అమ్మో, రాజీనామానా?"

గుండె కలుక్కుమంది అతనికి. ఎంత కష్టపడి తను ఆ స్థితి కి వచ్చాడు.

"కార్తీక్ నా మీద కక్ష తీర్చుకుంటున్నాడు. నీకు అర్థం కావడం లేదు" నెమ్మదిగా అన్నాడు.

"కార్తీక్ సంగతి నాకు తెలుసు. అందరూ నీలా ఉండరు" అందామె.

"ఏదో ఒకటి చేసుకో కానీ సుధాకర్ గాడి కాంట్రాక్ట్ వాడికి ఇప్పించు. వాడొక క్రిమినల్. వాడి గురించి మీకు తెలియదు." అతని గొంతులో భయం తాలూకు వణుకు వినిపించింది.

ఒక్క క్షణం ఆమె ఆలోచించింది. తర్వాత సీరియస్ గా చెప్పింది.

"అటువంటి వాళ్ళతో స్నేహాలు, బంధుత్వాలు, వ్యాపారాలు చేస్తే వచ్చే పర్యవసానాలు భరించక తప్పదు. ఈ విషయంలో నేనేమీ చేయలేను. కావాలంటే నువ్వే వచ్చి చూసుకో" కాస్త కటువుగా చెప్పి ఫోన్ పెట్టేసింది.

నివ్వెరపోయాడు సుధీర్.

____****____

# Part - 4

రాజధాని కి దాదాపు రెండు వందల కిలోమీటర్ల దూరంలో ఉంది ఆ గ్రామం.
సుధీర్, బృంద పుట్టి పెరిగిన ప్రాంతం.

పిల్లలంతా సిటీ లకి తరలి వెళ్లిపోగా మిగిలిన కొద్దిపాటి జనాభా ప్రపంచంతో సంబంధాలు లేకుండా రోజులు వెళ్లదీస్తున్నారు. సిటీల్లో అవకాశాలకు అర్రులు చాచని వాళ్ళు, ఇంకా సిటీ వ్యామోహం లో పడకుండా, పుట్టిన ఊళ్ళోనే పోవాలన్న సిద్ధాంతాన్ని జీర్ణించుకున్న వాళ్ళు మాత్రం అక్కడే ఉండిపోయి పనీపాటలు చేసుకుంటూ బ్రతుకుతున్నారు.

ఒకప్పుడు మనుషులతో కళ, కళలాడిన ప్రాంతం. ఇప్పుడక్కడ జవం లేదు, జీవం లేదు. ఆ ఊరిని పట్టించుకునే వాళ్ళు లేక బూడిద కమ్మినట్లుగా, ఎండిపోయినట్లుగా ఉంది. ఇదివరకు విశాలంగా ఉన్న రోడ్లు ఇప్పుడు సన్నగా, వంకరటింకరగా కుంచించుకు పోయాయి.

ఎటువంటి సెంటిమెంట్ లేని కఠిన మనస్కుడు అయిన సుధీర్ కే ఆ ఊళ్ళో అడుగుపెట్టగానే ఒక్క క్షణం మనస్సు చివుక్కుమంది.

ఎట్లాంటి ఊరు ఎట్లా అయిపోయింది?

ఒకప్పుడు ఊరికి వస్తుంటే దారంతా పచ్చటి పొలాలు కనపడేవి. ప్రతి ఇంటి ముందూ పూల మొక్కలు, కూరగాయల మొక్కలు ఉండేవి. ఎర్రటి మందారాలు, చిట్టి చేమంతులు లేని ఇల్లు ఉండేది కాదు. దారిలో నడుస్తున్న వాళ్ళకి పూల అందాలు స్వాగతం చెప్తున్నట్లుగా ఉండేవి. పెద్దవాళ్ళు అరుగుల మీద కూర్చుని వచ్చే పోయే వాళ్ళని పలకరిస్తూ కనపడేవాళ్లు.

శిథిలమైన మొండి గోడ లా ఉందా ఊరిప్పుడు.ఊరి అభివృద్ధి కోసం తనేమయినా చేసివుంటే బాగుండేదేమో అనిపించింది సుధీర్ కి ఆ క్షణాన. మరుక్షణం లో ఆ ఆలోచనను మెదడు లో నుంచి చెరిపేశాడు. ఆ ఊళ్ళో నివసిస్తున్న వాళ్ళకు లేని బాధ తనకెందుకనిపించింది. అతను ఎప్పటికప్పుడు తన మీద తనకి ఎటువంటి అపరాధ భావం లేకుండా ప్రతి విషయం లోనూ ఒక సిద్ధాంతాన్ని సృష్టించుకుంటాడు.

ఎటయినా వెళ్లిపోవాలి, కొన్నాళ్ళ పాటు ఎవరికీ కనిపించకూడదు అనుకున్నప్పుడు సుధీర్ కి తట్టిన మొదటి ఆలోచన ఆ ఊరే. ఆ ఊరు తప్ప తనని కడుపులో పెట్టుకుని చూసుకునే వాళ్ళు ఎవరూ లేరనిపించింది.

బృంద వాళ్ళు నివసించిన ఇల్లు ఇంకా బృంద పేరు మీదే ఉంది. పక్క ఇంటిని లత కొనుక్కుని అక్కడే నివసిస్తోంది. అక్క ఇల్లు పాడుబడిపోకుండా వారానికి ఒకసారి శుభ్రం చేయించటం, అవసరం అయినప్పుడు రిపేర్ చేయించటం చేస్తోందామె. ఆమె ని అడిగి ఇంటి కీస్ తీసుకోవచ్చు.

అదృష్టవశాత్తు అతను ఊళ్ళో అడుగు పెడుతున్నప్పుడు తెలిసిన వాళ్ళెవరూ అతణ్ణి గమనించలేదు.

అతను వచ్చే టైమ్ కి లత ఇంట్లో లేదు.  డ్రైవర్ ని పంపి పక్కింట్లో కనుక్కుంటే తెలిసింది.

టీచర్ గా పని చేస్తోందట. స్కూల్ కి వెళ్లిందట.

ఇదెప్పటి నుంచో...?

బృంద తో మాటలు ఉంటే ఇట్లాంటి విషయాలు అన్నీ తెలిసేవి. ఆవిడ తనతో మాట్లాడదు. అందుకే ఈ డెవలప్మెంట్ తన వరకూ రాలేదు. చిన్నప్పుడు లతకి చదువే వచ్చేది కాదు. పిల్లలకి ఈవిడ ఏం నేర్పుతుంది...వాళ్లేం నేర్చుకుంటారు?

ఓపిగ్గా ఆమె వచ్చేవరకూ కార్ లోనే కూర్చుని వెయిట్ చేశాడు.

"ఎంత హాయిగా ఉంది జీవితం? ఉరుకులు, పరుగులు లేవు, కుట్రలు, కుతంత్రాలు లేవు, ప్రెస్ ని ఎదుర్కోవాల్సిన అవసరం లేదు. తనతో ఉంటూనే తన చుట్టూ గోతులు తవ్వుతున్నారని తెలిసిన వాళ్ళతోనూ పైకి మర్యాదగా ప్రవర్తించాల్సిన అవసరం లేదు. పాము చుట్ట మీద కూర్చున్నట్లు ఉంటుంది పదవి అనేది. పైకి మెత్త గా ఉన్నట్లు భ్రమింపజేసినా, ఏ మాత్రం ఏమరుపాటు గా ఉన్నా బుసలు కొడుతూ లేచి కాటేస్తుంది. " విశ్రాంతిగా కార్ లో కూర్చున్నా కదుల్తున్న ఆలోచనలు.

నాలిగింటికి దూరంగా వస్తూ లత కనపడింది. బృంద అంత అందగత్తె కాకపోయినప్పటికీ బాగానే ఉంది అనుకున్నాడు. పల్లెటూళ్ళో పొల్యూషన్ అనేది సోకక కోనేట్లో తామర పూవు లా స్వచ్ఛంగా కనిపిస్తోంది.

ఎండలో నడిచి రావటం వల్ల పట్టిన చెమట ను తుడుచుకుంటూ గేట్ తీస్తోంది.

ఆమె లోపలికి వెళ్ళాక వెనకే వెళ్లి తన ఇంటి కీస్ అడగొచ్చని అనుకున్నాడు సుధీర్.

ఎంతకీ లోపలికి వెళ్ళటం లేదు.

కాసేపు మొక్కలు సవరించింది. తర్వాత ముందు వైపు వరండా లో వేలాడదీసిన పూసలు సర్దింది.

సుధీర్ కి కాసేపు అర్థం కాలేదు. ఏం మనుషులు వీళ్ళు?! వీళ్ల జీన్స్ లోనే ఏదో సీరియస్ లోపం ఉన్నట్లుంది. బృంద అట్లా, ఈమె ఇట్లా.

మెటీరియలిస్టిక్ విషయాలేవీ ఆనందం ఇవ్వవంటారు.

పూసలు, పెంకులు లాంటివి మెటీరియల్ కాదా? వాటికి ఆత్మ ఎమన్నా ఉంటుందా? ఎక్కువ ధర ఉండేవి మాత్రమే మెటీరియలిస్టిక్ అవుతాయా?

బయటే తను పలకరిస్తే ఆమె ఆశ్చర్యపోయి ఎక్కువ ప్రశ్నలు వేస్తుంది. ఈ లోగా ఎవరైనా చూసినా, విన్నా అనవసరమైన పబ్లిసిటీ అవుతుందని అతని భయం. వీలైనంత గుట్టు చప్పుడు కాకుండా ఈ ఊళ్ళో గడిపి విశ్రాంతి తీసుకోవాలని వచ్చాడతను. అందుకే ఆమె లోపలకి వెళ్తే తను అనుసరించి కీస్ తెచ్చుకోవాలని అతని ఆలోచన.

ఆమె లోపలకి వెళ్ళటం ఆలస్యం చేస్తున్న కొద్దీ అతనిలో అసహనం పెరగసాగింది.

పది నిమిషాలకి కానీ ఆమె తాళం తెరిచి లోపలికి వెళ్ళలేదు.

ఆమె లోపలకి అడుగు పెట్టగానే కార్ దిగి సుధీర్ వెనకే వెళ్ళాడు.

చేతిలో ఉన్న హ్యాండ్ బాగ్ హాల్ లో ఉన్న టీపాయ్ మీద పెట్టి సోఫా లో కూర్చోబోతోంది లత.

గుమ్మం దగ్గర అలికిడికి తలెత్తి చూసింది.

సుధీర్ ని చూసి ఒక్క క్షణం భ్రుకుటి ముడిచింది.

రాజకీయాల్లోకి ప్రవేశించాక ఒక్కసారి కూడా ఊరి వైపు కన్నెత్తి చూడని సుధీర్  ఇప్పుడు ఎందుకొచ్చినట్లు? అర్థం కాలేదామెకు.

అతను రాజకీయ నాయకుడు. అవతలి మనిషి తో పని లేదనుకున్నప్పుడు ఎంత తేలిగ్గా, చులకన గా  చూడగలడో...అవసరం ఉందనుకున్నప్పుడు అంతే ఈజీగా కాళ్ళు పట్టుకోవటానికి కూడా వెనుకాడని రకం. ఒక మనిషి జీవితాన్ని చిద్రం చేసి అది ఆ వ్యక్తి మంచి కోసమే చేశానని లోకం తో పాటు, నష్టపోయిన వ్యక్తిని కూడా నమ్మించగలిగే వ్యక్తి.

ఇన్నేళ్ళుగా అతను ఆ ఊరికే రాలేదు. సీఎం హోదా లో ఉండి కూడా చిన్నప్పుడు పెరిగిన ఊరుని బాగు చేయించాలనుకోలేదు.

నిజం చెప్పాలంటే బృంద కి ఒక చెల్లెలు ఉందన్న విషయమే అతనికి గుర్తులేదు. బృంద కి తనకీ ఉన్న గొడవలు ఆమె చెల్లెలికి తెలిసే అవకాశం ఉండొచ్చని అనిపించినా అతను కొంచెం కూడా జంకలేదు.

నవ్వుతూ అన్నాడు సుధీర్.
"గుర్తు పట్టావా?"

"ఆ మాట నేననాలి." అందామె. అంతలోనే సర్దుకుని

"రా సుధీర్. కూర్చో. ఇలా వచ్చావేమిటి? ఏదైనా పనా? అక్క రాలేదా?"  మామూలుగా పలకరించింది.

"అవును లతా. చిన్న పని మీదొచ్చాను. బాగున్నావా? మా ఇంటి కీస్ ఇస్తావా?" డొంక తిరుగుడు లేకుండా అడిగేశాడు.

కీస్ తెచ్చింది ఆమె.

"కాఫీ తాగి వెళ్లు" అంది.

"నేనిక్కడ కొన్నాళ్ళు ఉండబోతున్నాను. కాఫీ ఏం ఖర్మ, రోజు భోజనం కూడా నువ్వే పంపాల్సి ఉంటుంది. ఇప్పుడు మాత్రం అర్జంట్ గా వెళ్లాలి."

తలుపు వరకూ వెళ్లి ఏదో గుర్తొచ్చినట్లు ఆగి వెనక్కి తిరిగాడు.

" ఒక ముఖ్యమైన విషయం. నేనిక్కడ ఉన్న సంగతి ఎవరికీ తెలియకూడదు. సెక్యూరిటీ సమస్య అవుతుంది" అనేసి పక్కనే ఉన్న ఇంటికి వెళ్ళిపోయాడు.

తర్వాత డ్రైవర్ ని పిలిచి కార్ తీసుకుని వెళ్ళిపొమ్మన్నాడు. తనక్కడ ఉన్న సంగతి ఎవరికీ చెప్పవద్దనీ, మళ్లీ తన నుంచి ఫోన్ వచ్చేవరకూ ఇంట్లోనే వెయిట్ చెయ్యమని చెప్పి పంపేశాడు.

***

తలుపులు గడి పెట్టుకున్నాక  లైట్లు వేసి ఇల్లంతా ఒకసారి కలియతిరిగాడు.

Not bad...మరీ అంత పెద్ద ఇల్లేమీ కాదు కాని బాగానే ఉంది. ఒకప్పుడు ఈ ఇల్లు చూస్తే తనకి రాజప్రాసాదం లా అనిపించేది. ఇప్పుడు మామూలుగా అనిపిస్తోంది. తన ప్రస్తుత హోదా, ఆర్థిక పరిస్థితి అలాంటిది.

అక్క ఇల్లు చూసుకునే బాధ్యతని చెల్లెలు బాగానే నిర్వరిస్తోంది. ఇంట్లో మనుషులు ఉండని ఇంటిలా లేదు. నీట్  గా ఉంది.

తనకు తమ్ముడు ఉన్నాడన్న మాటే గాని ఇట్లా తనకు సహకరించడు. ప్రతి దానిలో తనకి పోటీ. తను తట్టుకోలేనంత గా...

గతం గుర్తొచ్చింది అతనికి.

***

అప్పటికి తమ్ముడి మీద పెద్దగా వ్యతిరేకత లేదతనిలో.  అన్ని కుటుంబాల్లో కుటుంబసభ్యుల్లాగే ఉండే వాళ్లు ఇద్దరూ.

మొదటినుంచీ తనకి పెద్దగా ఎమోషన్స్, సెంటిమెంట్లు ఉండేవి కాదు. సినిమాల్లో ఎమోషనల్ సీన్స్ చూసి కదిలిపోవటం, అమ్మానాన్నల కష్టం చూసి చలించి పోవటం ఇలాంటివి తనకి దూరం.

కార్తీక్ అలా కాదు. తల్లి వంట చేస్తుంటే సహాయం చేయటం, తండ్రి ఏదైనా పని చెప్తే బయటికి వెళ్లి చేసుకురావటం ఒక డ్యూటీ లా చేస్తుండేవాడు. ఇలాంటివి చేసి వాళ్ళని మెప్పించతానికి ప్రయత్నిస్తున్నాడనిపించేది తనకు. ఆ అవసరం ఏమిటో అర్ధం అయ్యేది కాదు.

ఇవన్నీ చేయకపోతే తల్లిదండ్రులకు తమ మీద ప్రేమ ఉండకుండా పోతుందా? సుధీర్ అదే అడిగాడు ఒకసారి కార్తీక్ ని.

"ఎందుకురా ఎప్పుడూ అమ్మానాన్నలను అట్లా మస్కా కొడుతుంటావు? అదంతా అవసరమా?"

"అదేం మాట అన్నయ్యా? వాళ్ళు కష్టపడుతున్నప్పుడు మనం హెల్ప్ చేయాలి కదా. చేతనైన సహాయం చేయాలి కదా!" వింతగా చూస్తూ జవాబిచ్చాడు కార్తీక్.

చదువు లో తను పూర్. తరచుగా తల్లిదండ్రులు తనని కార్తీక్ తో పోలుస్తుండే వాళ్ళు తను వాడికంటే తక్కువవాడినన్నట్లుగా. సుధీర్ కి ఇబ్బందిగా, కంటగింపుగానూ ఉండేది.

ఇది నాణానికి ఒక వెపయితే నాణానికి రెండో వేపున...బృంద.

బృంద అతనికో పెద్ద అబ్సెషన్!

ఆమె రూపం, ఆస్తి, తెలివితేటలు, పలుకుబడి గల ఆమె బాక్ గ్రౌండ్ అన్నీ తనకు చాలా గొప్పగా అనిపించేవి. ఆమెకి ఏ సహాయం అవసరం అయినా క్షణాల్లో రెక్కలు కట్టుకుని చేసేవాడు. ఆమె చుట్టూ ప్రదక్షిణాలు చేసేవాడు.

ఎంత పద్ధతి కలదైనా, తెలివైనది అయినా బృంద అక్కడే బోల్తా పడింది. చిన్న కుగ్రామం లో పెరగటం, పెద్దగా ఇటువంటి విషయాల్లో ఎక్స్ పోషర్ లేకపోవటంతో ఆమె అతనిది నిజమైన ప్రేమ అనుకుంది.

బృంద కి కూడా తనంటే ఇష్టమని కనిపెట్టడానికి సుధీర్ కి ఎక్కువ కాలం పట్టలేదు.

లత, బృంద, కార్తీక్, సుధీర్ చిన్నప్పటి నుంచి పక్క పక్క ఇళ్లల్లోనే పెరగటం, అంతా స్నేహితులు అవటంతో వాళ్ళు  కారమ్ బోర్డ్, చెస్ లాంటివి కలిసి ఆడుకోవటం, బయట బృంద వాళ్ల పెరట్లో కూర్చుని కబుర్లు చెప్పుకోవడం వంటి వాటి మీద రెండిళ్లలోనూ ఎవరికీ అభ్యంతరాలు ఉండేవి కాదు.

రోజులు అలా హాయిగా నడిచిపోతున్న టైమ్ లో...ఒకసారి తాము అంతా కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నప్పుడు లత కెమెరా పట్టుకొచ్చింది. వాళ్ళ చుట్టాలెవరో బహుమతిగా ఇచ్చారట.

చాలా ఫొటోస్ తీసుకున్నారు నలుగురూ. కెమెరా తనది అవటం తో  ఆ రోజు అంతా ఆమే పెత్తనం చేసింది .

ఫొటోస్ కడిగించాక తెలిసింది తొంభై తొమ్మిది శాతం ఫొటోస్ పాడయ్యాయని. లైటింగ్ సమస్యో, లెన్స్ కి వేలు అడ్డం పెట్టో ఉన్నాయి దాదాపు అన్ని ఫొటోస్ లోనూ. ఆ రోజు కార్తీక్ లతని తెగ ఏడిపించాడు. చదువెటూ రాదు. ఇది కూడా రాదా అని.

లత ఉడుక్కుంటే బాగా నవ్వుకున్నారు తాము ముగ్గురూ.

ఒకే ఒక్క ఫొటో మాత్రం కాస్త బాగా వచ్చింది.

బృంద, తను, కార్తీక్ ముగ్గురూ ఉన్న ఫొటో అది!

***

మర్నాడు తను బృంద ని కలవటానికి వెళ్లేసరికి ఆమె ఏదో పుస్తకం పట్టుకుని చాలా దీక్షగా చదువుతోంది. తనని చూసి ఆమె కళ్ళు తళుక్కుమని మెరిసాయి. లేదా తనలా అనుకున్నాడో…

కాసేపు మాట్లాడాక బృంద ని ఆమె తల్లి పిలిచేసరికి లోపలికి వెళ్ళింది. లత స్నేహితురాలి ఇంటికి వెళ్లిందట. కార్తీక్ ఏవో పరీక్షలు అని ఆ రోజు రాలేదు. ఒక్కడే కూర్చున్నాడు తను. బోర్ కొడుతోంది అతనికి. బృంద ఎంతకీ బయటకి రాకపోవటం తో ఆమె చదువుతూ పక్కన పెట్టిన పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు.

ఆధ్యాత్మికత కు సంబంధించిన పుస్తకం అది. ఎంత వోపిక ఈమె కి ఇటువంటివి చదవటానికి. పుస్తకం పక్కన పెట్టెయ్యబోతుండగా కనపడింది అతనికి. కార్తీక్ ఫొటో. తాము ముగ్గురూ దిగిన ఫొటో లో కార్తీక్ వరకూ కట్ చేసి పెట్టుకున్నట్లుంది బుక్ లో.

ఏదో శ్రద్ధగా చదువుకుంటోంది అనుకున్నాడు, ఇదన్నమాట ఆమె చేస్తున్నది!

అతని అహం ఆ రోజు దెబ్బ తిన్నంతగా మరే రోజూ తినలేదు. తన మీద తనకి ఏ మాత్రం నమ్మకం, ఏ మాత్రం కాన్ఫిడెన్స్ ఉన్నా దానిని కోల్పోయిన రోజది.

బృంద ప్రేమిస్తున్నది కార్తీక్ నా?  తనని కాదన్న మాట. విలవిలలాడి పోయాడు ఆ రోజు. తమ్ముడి మీద ఈర్ష్య తో రగిలిపోయాడు. ప్రతి చోటా ఈ వెధవ తనకి అడ్డమే. తన మీద తనకి చాలా తక్కువ అభిప్రాయం కలిగిన రోజది.

నాలుగు రోజులు తన గది నుంచి బయటకి రాలేకపోయాడు. మెల్లగా కోలుకుని బయటకి వచ్చాక అతను తన దృష్టి అంతా కెరీర్ మీద పెట్టాడు. బృంద తాతగారిని అంటి పెట్టుకొని తిరగటం మొదలెట్టాడు.

అతనికి రాజకీయాల మీదున్న శ్రద్ధ గ్రహించి ఆయన సుధీర్ ని తనకి తెలిసిన వాళ్ళకి పరిచయాలు చేసాడు. అతను ఉన్న ఊళ్లో నాయకత్వ లేమి కారణంగా తొందరలోనే అతను పైకి రావటం జరిగింది.

రాజకీయాల్లో అతను పైకి రావటం చూసి బృంద కుటుంబం ఆమెని అతనికి ఇచ్చి పెళ్లి చేయటానికి సిద్ధపడ్డారు. బృంద వద్దని గొడవ చేస్తుందని అనుకున్నాడు సుధీర్. కానీ అలా జరగలేదు. తమ పెళ్లికి ఆమె ఎందుకు వొప్పుకుందో, ఎలా వొప్పుకుందో అతనికి ఇప్పటికీ అర్థం కాని విషయం.

***

తన ఆత్మవిశ్వాసం దెబ్బ తిన్న ఆ సంఘటన ఇన్నాళ్ళకి మళ్లీ గుర్తుకొచ్చేసరికి గుండె బరువెక్కింది. గట్టిగా నిట్టూర్చాడు.

అంతలోనే ఇప్పుడు తనున్న పరిస్థితి గుర్తొచ్చింది. కొన్నాళ్లుగా నిద్రసేది లేదు. కాసేపు పడుకుంటే కానీ తిన్నగా ఆలోచించలేడు.

ఆలోచనలన్నీ కట్టిపెట్టి విశ్రాంతి గా మంచం మీద వాలిపోయాడు.

***

సాయంత్రం ఏడవుతుండగా సుధీర్ కి మెలకువ వచ్చింది.

అప్పుడే ఏడయిందా? ఏదో తప్పు చేసిన భావన. ఏమేమి పనులు ఆలస్యం అయిపోయాయో ఈ నిద్ర వల్ల. ఏవైనా మీటింగ్స్ ఉన్నాయా? ఏదైనా కార్యక్రమంలో మాట్లాడటానికి నోట్స్ చూసుకోవాలా?

ఉలిక్కిపడి లేచాడు. అతనికి కాసేపు ఎక్కడున్నదీ అర్థం కాలేదు. హడావిడిగా లేచేసరికి సన్నగా వొణుకు వస్తోంది అతని శరీరం నుంచి.

మళ్లీ మంచం మీద వాలిపోయాడు. రెండు చేతులూ తలమీద పెట్టుకుని వెల్లకిలా పడుకుని ఆలోచించసాగాడు.

ప్రస్తుత సంఘటనలు అన్నీ రీల్ లాగా కళ్ల ముందు కదులుతున్నాయి.

ఇప్పుడు తను అర్జెంట్ గా ఏ పనీ చేయాల్సిన అవసరం లేదని తల్చుకోగానే అతనికి మనసంతా ప్రశాంతంగా అనిపించింది. ఎవరికీ జవాబు చెప్పక్కర్లేదు. అసిస్టెంట్లు రాసి ఇచ్చే నోట్స్ చదివి ఉపన్యాసాలు దంచాల్సిన అవసరం లేదు.

పదవిలో ఇంత వొత్తిడి ఉంటుందా? తనకే విరక్తి పుట్టి పారిపోయి విశ్రాంతి తీసుకోవాలనిపించేట్లు ఉంటే ఇక వేరే వాళ్లేం తట్టుకుంటారు.

మళ్లీ ఆలోచనలు మారాయి.

తను చేసిన పని మంచిదేనా? ఒకవేళ పదవి నుంచి రాజీనామా చేసి ఉంటే పోయేదా? లేదు...లేదు...అసలది సాధ్యం కాదు. తను పదవి నుంచి తప్పుకున్న మరుక్షణం అంతకు ముందు తన వల్ల కానీ, తన అనుచరుల వల్ల కానీ నష్టపోయిన వాళ్ళు తనని ముప్పతిప్పలు పెడతారు.

పోనీ కొన్నాళ్ళు విశ్రాంతి కోసమని చెప్పి సెలవు పెట్టాలన్నా ఈ పదవిలో ఉండగా జరిగే పని కాదు. తను ఎక్కడున్నా ప్రెస్ వాళ్ళు వేటాడతారు. పైగా తాము పెడుతున్న వొత్తిడి పని చేస్తున్నదని తెలిస్తే ప్రతిపక్షాల వాళ్ళు ఊరుకుంటారా? మరింత వొత్తిడిని పెంచుతారు. రాజకీయాల్లో మన బలహీనతల్ని అవతలి వాళ్ళకి తెలియనిచ్చిన మరుక్షణం మన పతనం ప్రారంభమవుతుంది.

తన నిర్ణయం మంచిదే అనిపించింది. బృంద తెలివైనది. ఏదోలా ముందుకు నడిపిస్తుంది. తనతో మాట్లాడుతున్నట్లయితే ఇక్కడికి వచ్చే ముందే ఆమె సలహా తీసుకునేవాడు.  అడిగినా ఆమె సహాయం చేస్తుందనే నమ్మకం లేదు. అందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడు.

ఇంతలోనే ఒక ఆలోచన వచ్చింది...

ఇలా కనపడకుండా పోయినందువల్ల ఆ ఆందోళన లో అయినా బృంద తనతో మాట్లాడుతుందేమో.

తను కొన్నాళ్ళు అజ్ఞాతంలో ఉండదల్చుకున్నాననీ, ఆమెనే ఏదోలా మేనేజ్ చేయమనీ బృంద కి మెసేజ్ చేసాడు.

వెంటనే బృంద నుంచి ఫోన్ వచ్చింది. ఎత్తకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పక్కన పడేశాడు. ఒక నెలన్నా విశ్రాంతి తీసుకోవాలి.

లేచి హాల్లో కి వచ్చాడు. వస్తూనే అక్కడున్న ఆకారాన్ని చూసి ఉలిక్కిపడ్డాడు.

"సార్, లతమ్మ మీకు ఇచ్చి రమ్మంది" అక్కడ ఫ్లాస్క్ లో ఉంచిన కాఫీ, టిఫిన్ ప్లేట్ చూపిస్తూ అందా ఆకారం.

"లోపలకి ఎట్లా వచ్చావ్" అనుమానంగా అడిగాడు.

"లతమ్మ దగ్గర ఇంకో తాళంచెవి ఉంది. వారానికి ఒకసారి ఈ ఇల్లు నేనే శుభ్రం చేస్తాను. నా పేరు వల్లి" చెప్పిందామె.

తలూపాడు.

ప్రస్తుతం తనకి ఒక కప్ టీ చాలా అవసరం.

ఆమె వెళ్ళిన కాసేపటికి లతతో కలిసి మళ్లీ తిరిగి వచ్చింది.

"ఏంటి సుధీర్ సడెన్ గా వచ్చావ్? కాసేపు విశ్రాంతి తీసుకున్నాక అడగొచ్చని ఇందాక ఎక్కువ మాట్లాడించలేదు. ఇప్పుడు చెప్పు" కూర్చుంటూ అంది లత.

క్షణం పాటు మనసు చివుక్కుమంది అతనికి.

తనని ఏ రోజూ వరస పెట్టి గౌరవంగా ' అని పిలవదు. అదే మాట పైకి అడగాలంటే ఏమి జవాబు వినాల్సొస్తుందో అని భయం. .

లత తో పాటు వచ్చిన వల్లి వైపు చూసాడు.

"లోపలికెళ్లి వంట చేయి" లత ఆమెకు పురమాయించింది.

ఆమె అవతలికి వెళ్ళగానే కుతూహలంగా అడిగాడు.

"ఆమె అట్లా ఉందేమిటి?"

"ఒక సారి వంట చేస్తుంటే కుక్కర్ పేలిపోయిందట. మొహం, మెడ అన్నీ కాలిపోయి అలా అయింది. భర్త వదిలేశాడు. నా దగ్గరే ఉంటోంది" క్లుప్తంగా చెప్పింది.

"సంఘసేవ" వెటకారంగా అనుకున్నాడు  సుధీర్. వీటికేమి కొదవ లేదు అక్కాచెల్లెళ్లకి.

"నువ్వు చెప్పు సుధీర్" అందామె.

"ఏమి చెప్పను?" ఆలోచిస్తున్నాడు సుధీర్.

"నేను కొన్ని సమస్యల్లో ఉన్నాను. కొన్నాళ్ళ పాటు అజ్ఞాతంగా ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే వచ్చాను" జాగ్రత్తగా ఆచితూచి చెప్పాడు.

తల ఊపిందామె. ఇంకేదైనా చెప్తాడేమో అని కొద్ది సెకన్లు మౌనం వహించింది. అతనేమీ మాట్లాడేలా కనపడలేదు.

"మా అక్కకి ఏమీ ఆపద లేదు కదా?" సడన్ గా అడిగింది.

అందరికీ బృంద అంటే ఇష్టం. ప్రతి వాళ్ళూ ఆమె గురించి ఆందోళన చెందేవాళ్లే!!

ఆలోచిస్తూనే లేదన్నట్లు తల అడ్డంగా ఊపాడు.

"మంచి ఊరునే ఎన్నుకున్నావ్.  ఇక్కడ నిన్నెవరూ గుర్తు పట్టరులే సుధీర్" అందామె.

"ముఖ్యమంత్రిని గుర్తు పట్టరా?" ఆశ్చర్యంగా చూసాడు సుధీర్.

"ఇక్కడ మిగిలిపోయిన జనాల సంగతి నీకు తెలీదు సుధీర్. వాళ్ళ పేర్లే వాళ్ళకి గుర్తుండవు. అంతా మొద్దు జనం" తల్లి తన బిడ్డలు అమాయకులని మురిపెంగా చెప్పినట్లుగా చెప్తోంది లత.

"ఈవిడ టీచర్ అంటే ఇక జనాలు మొద్దుల్లా తయారవటం లో పెద్ద ఆశ్చర్యం ఏముంది" అనుకున్నాడు సుధీర్.

"పాత వాళ్ళు మీరు తెలిసిన వాళ్ళు ఊరంతా వెతికినా పది మంది కన్నా ఎక్కువ ఉండరు. వాళ్లు కూడా నిన్ను కార్తీక్ అనుకుంటారులే. నువ్వు కంగారు పడి మరీ తలుపులేసుకుని ఇంట్లో వుండక్కర్లేదు. బయట తిరగొచ్చు." అంది లత.

తల ఊపాడు.

"నీకు వంటకి కావాల్సిన ఏర్పాట్లు అన్ని వల్లి చేస్తుంది" చెప్పి లేచింది లత.

"లతా, ఒక్క మాట" ఆమెను ఆపుతూ అన్నాడు సుధీర్.

తలుపు వరకూ వెళ్ళిన ఆమె వెనక్కి తిరిగి చూసింది.

"నేను ఇక్కడ ఉన్న విషయం మీ అక్కతో కూడా అనకు. బృంద ఫోన్ టాప్ అయిఉంటుంది. అవసరం అయినప్పుడు తనకి నేనే చెప్తాను" అన్నాడు.

విచిత్రంగా చూసింది ఆమె. తర్వాత అక్కడ నుంచి వెళ్లిపోయింది.

వల్లి వంట బాగానే చేసింది కానీ బృంద వంటలా లేదు. ఆ రోజు రాత్రి డిన్నర్ చేసేప్పుడు అనుకున్నాడు సుధీర్.

తను అనవసరంగా ఇక్కడికి వచ్చాడా? మాటిమాటికీ బృంద గుర్తొస్తోందేమిటి??

***

మర్నాడు పొద్దున అలవాటు కొద్దీ ఆరింటికే మెలకువ వచ్చింది సుధీర్ కి. కాసేపటికి వల్లి వచ్చి పనులు మొదలెట్టింది.

తోచక టీవీ పెట్టాడు.

ప్రతిపక్ష నాయకుడు తనకంటే ముందే లేచి ఇంటర్వ్యూ మొదలెట్టాడో, అంతకు ముందు రోజు తీసుకున్నారో తెలీదు.

"సుధీర్ అన్ని విధాలా ముఖ్యమంత్రిగా  ఫెయిల్ అయ్యాడు. రాజీనామా చేయాల్సిందే. అసెంబ్లీ లో అన్నీ అడుగుతాం, కడిగి పారేస్తాం. రాజీనామా చేయించి తీరుతాం" చూపుడు వేలు చూపిస్తూ అంటున్నాడు. పక్కనే తను తల వంచుకుని నిలబడ్డ ఫోటో చూపిస్తున్నారు. చూసేవాళ్ళకి పార్టీ తిడుతుంటే తను తప్పు వొప్పుకొని తల వంచుకుని నిల్చున్నట్లు కనబడుతుంది.

"వాడొక్క సారి అంటే వీళ్ళు వంద సార్లు చూపిస్తారు" చిరాగ్గా అనుకున్నాడు సుధీర్.

"అసలీ పార్టీ తను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయక ముందు నుంచే రాజీనామా చేయాలని గోల మొదలెట్టాడు. తనేమన్నా పిచ్చోడా, కష్టపడి ఈ స్థాయికి చేరుకుని వీళ్ళు రెచ్చగొట్టగానే రాజీనామా చేయటానికి?"

కాఫీ తెచ్చిన వల్లి టీవీ వైపే చూస్తోంది ఆసక్తిగా.

తనని గుర్తు పట్టిందేమో టీవీలో అని అనుమానం వచ్చింది సుధీర్ కి.

టీవీ ఆఫ్ చేసి ఆమెని అక్కడ నుంచి పంపేశాడు.

ఫోన్ లో నెట్ సర్ఫ్ చెయ్యసాగాడు. తన గురించి ఏమైనా న్యూస్ ఉందా...? ఆసక్తి గా వెతుకుతున్నాడు.

ఒకసారి పదవి కీ, నలుగురూ తమని గొప్పగా చూడటానికి అలవాటు పడ్డవారు పైకి ఎంత కాదన్నా మంచికో, చెడుకో అందరి నోళ్ళ లో నానటానికే ఇష్టపడతారు.

రోజు ఉండే న్యూసే. తను ఉన్నా లేకపోయినా ఎవరికీ తేడా రాలేదు. కొద్ది పాటి నిరాశ కలిగింది అతనికి. మళ్లీ సర్దుకున్నాడు. తనేగా కొన్నాళ్ళు గోప్యంగా ఉండాలనుకున్నాడు. ఇదే మంచిది.

***

రెండు రోజులు ఇంట్లో గడిపాక అతనికి విపరీతమైన బోర్ కొట్టసాగింది. అజ్ఞాతం వీడిన తర్వాత ఏమి చేయాలనే విషయంపై కూడా అతనికి ఆలోచనలు ముందుకు సాగడం లేదు. బ్రెయిన్ డ్రైన్ అయినట్లుగా ఉంది.

కాసేపు బయట చల్లటి గాలిలో తిరిగి రావాలనిపించింది. ఎటూ తనని ఎవరూ గుర్తు పట్టరంది కదా లత.

సాయంత్రం ఆరవుతుండగా తలుపులు వేసి బయటకు నడిచాడు.

జేబుల్లో చేతులు పెట్టుకుని, తల మీదుగా మెడ చుట్టూ మఫ్లర్ వేసుకుని నెమ్మదిగా నడుస్తున్నాడు.

నాలుగడుగులు వేశాడో లేదో వినిపించింది.

"ఒరేయ్"

"తననేనా?"

తను ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి. మరీ ఒరేయ్ అని మొహం మీద ఎవరంటారు.

ఇంతలో వీపు మీద ఫెడెల్మని ఒక దెబ్బ పడింది.

వీపు చుర్రుమంటోంది. కోపంగా వెనక్కి తిరిగాడు.

"నేనురా. గుర్తు పట్టలేదా?" గట్టిగా తనని చుట్టుకుపోతున్నాడు ఒక మనిషి.

గుండె గుభేల్మంది. వీడేవడో తనని గుర్తు పట్టాడా ఏమిటి?

రెండు చేతులతో అతని భుజాలు పట్టుకుని వెనక్కి జరిపి మొహం కేసి చూసాడు.

ఎవరో అర్థం కాలేదు.

బాగా అడ్డదిడ్డంగా పెరిగిపోయిన తెల్ల జుట్టు, పెద్ద పొట్ట, జిడ్డోడుతున్న మొహం, బవిరి గడ్డం, కొన్ని గుండీలు లేని షర్ట్, కింద బ్లూ, నలుపు గళ్ళ లుంగీ కట్టుకుని ఉన్నాడు.

తను గుర్తు పట్టలేదని అతను ఒకింత నిరాశ కి గురయినట్లున్నాడు.

"నేను రా కార్తీక్, రాముని. స్కూల్ లో కలిసి చదువుకున్నాం నాలుగేళ్లు. గుర్తు లేదా?" అడిగాడతను.

ఇతను కార్తీక్ వయసు వాడా? అంటే తన కంటే చిన్న వాడు. కానీ తమ కన్నా ఇరవయ్యేళ్లు పెద్దవాడు లా కనపడుతున్నాడు.

అన్ని సౌకర్యాలు, మంచి ఆహారం, వైద్యం లభించటం తో తమ లాంటి వాళ్ళు ఇంకా చిన్నగా కనపడుతుంటే వీళ్ళు చిన్న వయసులోనే ముసలి వాళ్ళ లా తయారవుతున్నారు.

ఏదైతేనేం తనని గుర్తు పట్టలేదు. కార్తీక్ అనుకుంటున్నాడు.

"ఇప్పుడు గుర్తొచ్చింది" ఇబ్బంది గా నవ్వి అన్నాడు సుధీర్.

మళ్ళీ గట్టిగా మీద పడి కౌగిలించుకున్నాడు అతను. చెమట కంపు...ఏడుపొస్తోంది సుధీర్ కి.

తర్వాత వద్దంటున్నా సుధీర్ ని తన ఇంటికి లాక్కు వెళ్ళాడు రాము.

బయట అరుగు మీద ఒక ముసలావిడ కూర్చుని ఉంది.

"అమ్మా, కార్తీక్ వచ్చాడు" భుజం మీదున్న టవల్ తో మొహం తుడుచుకుంటూ చెప్పాడతను.

తేరిపార చూసిందామె.

"కార్తీక్ అంటే ముఖ్యమంత్రి సుధీర్ తమ్ముడేగా!" అడిగింది.

ఆమె 'ముఖ్యమంత్రి సుధీర్' అన్న మాటలకి అతని మనసు పులకించింది. కాస్త గర్వంగా తలూపాడు.

"పేరుకి ముఖ్యమంత్రి. మన ఊరికి ఏమన్నా చేశాడా? వొట్టి దగుల్బాజీ వెధవ. ఈ ఊరు పిల్లని వాడికి ఇచ్చి దాని గొంతు కోశారు. నాశనం అవుతాడు వెధవ" ఆమె తిట్లు ప్రవాహం లా మొదలయ్యాయి.

"వీడేమి చేస్తాడమ్మా. వీడిని కూడా వాళ్ళ అన్న కేసుల్లో ఇరికించి నానా ఇబ్బంది పెట్టాడంటారు" ఆమెని ఆపుతూ అన్నాడు రాము.

"నిన్ను కూడానా? ఈ ఊరు పిల్లనిచ్చి దాని గొంతు కోశారు. ఉంచాడో, చంపేశాడో. ఎప్పుడో చిన్నప్పుడు చూసా...పెళ్లయి వెళ్ళాక మళ్ళీ ఇంత వరకూ చూడలేదు" కొత్త కోణం తీసుకొచ్చింది ఆవిడ.

షాక్ తిన్నాడు సుధీర్.

"ఎంత క్రియేటివిటీ? క్షణాల్లో కథ అల్లేసింది ముసలావిడ. అమ్మో...ఈ ఊరి ఆడవాళ్ళు తక్కువ వాళ్ళా? చంపితే చావడానికి. గుడినీ, గుళ్ళో లింగాన్ని కలిపి మింగే రకాలు" కసిగా అనుకున్నాడు సుధీర్.

ఇంతలోకి రాము భార్య, పిల్లలు బయటికి రావటంతో ఆమె దండకానికి బ్రేక్ పడింది.

వాళ్ళని పరిచయం చేశాడు రాము అతనికి.

"మీ గురించి చాలా విన్నాం అంకుల్" అన్నాడు అతని కొడుకు.

"అవునురా అబ్బాయ్. నువ్వు మంచివాడివే కానీ మీ అన్న వొట్టి సన్నాసి" మళ్ళీ మొదలెట్టింది అతని తల్లి.

తనకు అస్సలు పడని తమ్ముడిని పొగుడుతూ, తనని అన్ని తిడుతుంటే పైకి నవ్వుతూ నటించటం అతను భరించలేకుండా ఉన్నాడు.

వెనక నుంచి కిసుక్కున నవ్వు వినపడింది. తిరిగి చూశాడు.

లత....వాకింగ్ కి వెళ్లి తిరిగి వస్తోందట. తమ మాటలు వినపడి ఆగిపోయానంది.

ఆ తిట్లన్నీ విన్నట్లుంది. మొహంలో ఆనందం కనిపిస్తోంది.

"తన మీద ఊరందరికీ ఈవిడే చెప్తూ ఉండి ఉంటుంది" ఉక్రోషంగా అనుకున్నాడు.

అంతలోనే రాము తల్లి మళ్ళీ మొదలెట్టింది.

"నిన్ను ఇష్టపడి ఇది పెళ్లి చేసుకోలేదు. నువ్వేమో మీ అన్న వల్ల జైలు పాలయ్యావు. ఇంత మంది జీవితాలు నాశనం చేసి వాడేం బాగు పడతాడు. సర్వనాశనం అయిపోతాడు" మెటికలు విరుస్తోందామె.

తన మీద పగ పట్టినట్లుందీ ముసల్ది. వీలైతే కరోనా వైరస్ కూడా తన వల్లే వ్యాపిస్తోంది అని ప్రచారం చేసేలా ఉంది.

"మామ్మా...ఇక ఆపేయ్యి" గద్దించినట్లుగా అంది లత.

ఆమె ప్రవాహానికి అక్కడితో అడ్డుకట్ట పడింది.

లత తో పాటే ఇంటి వైపు అడుగులు వేస్తున్న సుధీర్ కి అలజడి గా ఉంది. అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ కార్తీక్ గాడినే ఇష్టపడ్డారా? చెల్లెలి కోసం త్యాగం చేసి బృంద తనని చేసుకుందా? టాలీవుడ్ సినిమా కథ చూపిస్తున్నారు అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ కలిసి తనకి.

ఇందాక ముసల్ది ఎన్ని తిట్టింది తనని. తన అనుచరులకు తెలిస్తే ఒక్క నిమిషం పట్టదు వాళ్లకు ఆమె ఒకప్పుడు భూమి మీద ఉందేదన్న ఆనవాళ్లు లేకుండా చేయటానికి.

***

మరి కొన్నాళ్ళు ఇంట్లోనే గడిపేశాడు సుధీర్. అప్పుడే వారం అయిపోవస్తోంది.

తనకి అసలేం చేయాలో తోచడం లేదు. ఒకటా రెండా ఎన్ని కేసులు....మరో రెండేళ్లలో ఎలక్షన్లు...ప్రజలతో మంచివాడనిపించుకుని ఎలాగయినా వచ్చే ఎలక్షన్ గెలవాలి. నోట్ బుక్ ముందు పెట్టుకుని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో లత వచ్చింది.

"సుధీర్ టీవీ పెట్టు ఒకసారి" అంది

ఆమె మొహం ఉద్విగ్నంగా ఉంది.

"ఎందుకు...? ఏ ఛానెల్?" అడిగాడు.

"అన్నిటిలో లైవ్ వస్తోంది. పెట్టు." అందామె.

అప్పటికే ఆన్ చేసాడతను. కార్తీక్ మాట్లాడటం చూపిస్తున్నారు.

అంటే తన స్థానంలో కార్తీక్ ని తెచ్చినట్లుంది బృంద.

ఆ మధ్య ఎవరో ఒకమ్మాయి భర్తని చంపి బాయ్ ఫ్రెండ్ మీద ఆసిడ్ పోయించి మొహం మార్చి భర్తలా నటింపజేయటానికి కుట్ర పన్నిందట.

ఇక్కడ ఆ అవసరం కూడా లేదు. అన్నీ బృంద కోరుకున్నట్లే జరిగిపోతున్నాయి. తనేమో దాక్కోవాల్సిన పరిస్థితి. వాడేమో అచ్చు తన పోలికే.

"ఛీ ఛీ....బృంద అలాంటిది కాదు" తన మీద తనే చిరాకు పడ్డాడు.

పక్కకి చూసేసరికి లత టీవీ లో కార్తీక్ ని చూసి బుగ్గల్లో గులాబీలు పూయిస్తోంది. కాసేపు ఈర్ష్య గా అనిపించింది అతనికి. ఇన్నేళ్లు ఉంటుందా ఒక మనిషి మీద ఇష్టం? తను దురదృష్టవంతుడిని అనిపించింది అతనికి.

***

మర్నాడు సుధాకర్ అండ్ కో కి తామిచ్చిన కాంట్రాక్టులు అన్ని రద్దు చేశారన్న వార్త చూసి అతనికి పై ప్రాణం పైనే పోయింది.

వెంటనే బృంద కి ఫోన్ చేసాడు.

ఆమె ఏమన్నది? అటువంటి వాళ్ళతో సంబంధాలు పెట్టుకుంటే దాని వల్ల కలిగే కష్ట నష్టాలు భరించక తప్పదు అని కదూ అన్నది. ఎంత కాఠిన్యం...ఇద్దరి మధ్య మాటలు లేకపోవటమే ఒకరకంగా మంచిదేమో అనిపించింది ఆ నిమిషాన అతనికి.

మర్నాటి నుంచి అసెంబ్లీ.

ఈ కార్తీక్ గాడు అక్కడేం చేస్తాడో. పార్థు రాజీనామా చేయమనగానే చేసేస్తాడేమో.

టెన్షన్ తో చచ్చిపోతున్నాడు సుధీర్.

----***-----